ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 14 మార్చి 2024



సబ్సిడీ చెక్కులను అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : జేసీ

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 13: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బుధవారం ప్రధాని నరేంద్రమోదీ పీఎం సూరజ్ జాతీయ పోర్టల్ లాంచ్ కార్యక్రమంలో భాగంగా దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 510 జిల్లాలకు చెందిన వివిధ పథకాల లబ్ధిదారులతో వర్చువల్ విధానంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, సోషల్ వెల్ఫేర్ డీడీ జాకీర్‌హుస్సేన్, బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహా, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ భాస్కర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అర్హులందరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. రుణాలు తిరిగి బ్యాంకులకు చెల్లించడం వల్ల లబ్ధిదారులకు మళ్లీ రుణం తీసుకునే అవకాశం కల్పిస్తారన్నారు. జిల్లాలో 1270 మంది లబ్ధిదారులకు సంబంధించి సబ్సిడీ రుణాలు రూ.15.40 కోట్లకు సంబంధించిన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వివిధ రంగాల్లో రుణాలు పొందిన లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి రెండు ప్రాజెక్టుల ఎంపిక

- కలకడ, కలికిరికి చెందిన విద్యార్థుల ప్రతిభ



చిత్తూరు డీఈవో నుంచి బహుమతి అందుకుంటున్న జాతీయ స్థాయికి ఎంపికైన అన్నమయ్య జిల్లా విద్యార్థులు

రాయచోటి టౌన్, మార్చి 13: జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి తెలిపారు. కలకడ మండలం, ఎర్రయ్యగారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రుక్సానా రూపొందించిన సీడ్స్ షోయింగ్ మెషిన్, కలికిరి సైనిక్ స్కూల్‌కు చెందిన నిహాల్ కృష్ణ రూపొందించిన రిమోట్ కంట్రోల్ ఫీల్డ్ స్మోకర్ అనే రెండు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయన్నారు. ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు చిత్తూరు జిల్లా పలమనేరులో రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీలకు రాష్ట్ర స్థాయి నుంచి 306 ప్రాజెక్టులు ప్రదర్శించగా అందులో 24 ప్రాజెక్టులు జాతీయస్థాయికి ఎంపిక చేశారన్నారు. అందులో అన్నమయ్య జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయన్నారు. దీంతో ఈ రెండు ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులు చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. జాతీయ స్థాయికి ఎంపికయ్యేటట్లు ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులను, వారికి గైడ్ చేసిన ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖాధికారి శివ ప్రకాశ్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డిలు అభినందించారు.

తొలి తెలుగు కవయిత్రి మొల్ల : ఎస్పీ



జిల్లా పోలీసు కార్యాలయంలో మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటిటౌన్, మార్చి 13: తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ అని ఎస్పీ కృష్ణారావు అన్నారు. బుధవారం మొల్లమాంబ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొలి తెలుగు కవయిత్రి, రామాయణ మహాగ్రంథ తెలుగు అనువాది, స్త్రీల పట్ల సమాజంలో ఉన్న వివక్షను ఛేదించుకుని వెలుగు చూసిన నారీమణి కవయిత్రి మొల్లమాంబ అని కొనియాడారు. 16వ శతాబ్దంలోనే మహిళా సాధికారితకు నాంది పలికిన ధీరురాలు, స్వతంత్ర భావాలు కలిగిన దార్శనికురాలు, పండితులకే కాకుండా పామరులకు అర్థమయ్యే రీతిలో రామాయణాన్ని రచించి ప్రజలకు అందజేసిన కవయిత్రి అని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఏఏవో కృష్ణుడు, సీఐలు భాస్కర్, చంద్రశేఖర్, ఉమామహేశ్వరరావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంటా నరహరి జనసేనలో చేరిక

రాయచోటి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకుడు గంటా నరహరి బుధవారం విజయవాడలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరారు. సుమారు సంవత్సర కాలంగా గంటా నరహరి రాజంపేట పార్లమెంటు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ఒకానొక దశలో రాజంపేట పార్లమెంటు స్థానానికి టీడీపీ తరపున అతను అభ్యర్థిగా బరిలో ఉంటాడనే ప్రచారం సాగింది. అయితే తర్వాత అనూహ్యంగా ఆయన రాజంపేట అసెంబ్లీ స్థానాన్ని ఆశిస్తూ వచ్చారు. మళ్లీ ఏమైందో.. ఏమో తిరుపతి అసెంబ్లీ స్థానానికి టీడీపీ తరపున పోటీలో ఉంటాడని ప్రచారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో అనూహ్యంగా ఆయన టీడీపీ నుంచి జనసేనలో చేరారు. తిరుపతి అసెంబ్లీ స్థానం విషయమై స్పష్టత వచ్చిన నేపథ్యంలోనే ఆయన జనసేన గూటికి చేరినట్లు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



చీరల పంపిణీలో.. చిలక్కొట్టుడు..

- పంపిణీ లెక్కల్లో తేడా.. ఆగిన చీరల పంపిణీ
- వాల్మీకిపురంలో అధికార పార్టీ నాయకుల మధ్య చిచ్చు



వైసీపీ నాయకులు పంపిణీ చేసిన పట్టుచీర

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు అధికార పార్టీ చేపట్టిన చీరల పంపిణీ వాల్మీకీపురంలో అధికార పార్టీ నాయకుల మధ్య చిచ్చురేపింది. చీరల పంపిణీ లెక్కల్లో తేడా రావడంతో ప్రస్తుతానికి చీరల పంపిణీ నిలిపేసినట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం ఈ విషయం జిల్లా వ్యాప్తంగా అధికార పార్టీలో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. అధికార పార్టీ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు పలు అక్రమ మార్గాలు ఎంచుకుంది. ఇందులో భాగంగా మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు చీరలు పంపిణీ చేస్తోంది. పట్టుచీర ఉన్న బ్యాగును ఓటర్లకు ఇంటింటికీ తిరిగి అధికార పార్టీ నాయకులు, వలంటీర్లు కలిసి పంపిణీ చేస్తున్నారు. బహిరంగంగా ఓటర్లకు కానుకలు ఇస్తే అధికారులు చర్యలు తీసుకుంటారనే భయం లేకుండా ఇంట్లో శుభకార్యానికి పిలిచినట్లు అందరూ కలిసి వెళ్లి చీరలు ఉన్న బ్యాగులు పంచుతున్నారు. ఇప్పటికే పీలేరు, రైల్వేకోడూరు నియోజకవర్గాలతో పాటు జిల్లావ్యాప్తంగా పలుచోట్ల ఈ చీరల పంపిణీ జోరుగా సాగుతోంది. పంపిణీ చేయాల్సిన చీరలను స్థానికంగా ఉన్న అధికార పార్టీ నాయకులకు అప్పగిస్తున్నట్లు తెలిసింది. ఎన్ని ఇళ్లు? ఎంతమంది ఓటర్లు? అనే లెక్క ప్రకారం ఈ చీరలను నాయకులకు అప్పచెబుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వాల్మీకిపురం మండలంలో చీరల పంపిణీ లెక్కల్లో తేడా వచ్చినట్లు తెచ్చింది. సుమారు 700 నుంచి 800 చీరల లెక్క తేడా వచ్చినట్లు సమాచారం. ఈ విషయమై అధికార పార్టీ నాయకుల మధ్య విభేదాలు పొడచూపినట్లు తెలిసింది. దీంతో చీరల లెక్కలు తేలే వరకు చీరల పంపిణీ జరగకపోవచ్చు. ఏదేమైనా వాల్మీకిపురం మండలంలోని అధికార పార్టీ నాయకుల మధ్య చీరల పంపిణీ చిచ్చుపెట్టిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం ఇదే విషయం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.



పట్టుచీర ఉన్న బ్యాగు

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (గురువారం సాయంత్రం)	సెహరీ (శుక్రవారం ఉదయం)
రాయచోటి	6.30	5.03
మదనపల్లె	6.31	5.10
రాజంపేట	6.30	5.06
పీలేరు	6.29	5.08

శ్రుతి మించుతున్న యువత

- టెన్త్ విద్యార్థిపై దారుణంగా దాడి
- సోషల్ మీడియాలో వీడియో వైరల్



మదనపల్లెలో టెన్త్ విద్యార్థిపై బెల్టులు, కర్రలతో దాడి చేస్తున్న యువకులు

మదనపల్లె టౌన్, మార్చి 13: మదనపల్లెలో కొందరు యువకులు శృతి మించిపోతున్నారు. పట్టపగలే అందరూ చూస్తుండగా ఓ టెన్త్ విద్యార్థిపై బెల్టులు, కర్రలతో దారుణంగా దాడిచేశారు. చుట్టుపక్కల వారు అడ్డగిస్తున్నా రెచ్చిపోయి తీవ్రంగా కొట్టారు. అక్కడే ఉన్న కొంతమంది ఈ వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో పోలీసుల దృష్టికి వెళ్లింది. వివరాల్లోకి వెళితే... మదనపల్లె మండలం జంగాలపల్లెకు చెందిన ఓ విద్యార్థి పట్టణంలోని జడ్పీ హైస్కూల్లో టెన్త్ చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం స్కూలు వదిలేశాక 5 గంటల సమయంలో స్థానిక మెట్రో కాంప్లెక్స్ వద్ద టీ తాగుతున్న టెన్త్ విద్యార్థిని ముగ్గురు యువకులు వచ్చి అడ్డగించారు. హఠాత్తుగా బెల్టులు, కర్రలు తీసి చితకబాదారు. వీపుపై బెల్టులతో కొడుతూ, కాళ్లతో తన్నుతూ కింద పడేసి కొట్టారు. స్థానికులు ఈ దాడిని అడ్డుకుంటున్నా వినకుండా రెచ్చిపోయిన యువకులు విద్యార్థిని తీవ్రంగా గాయపరిచి వెళ్లిపోయారు. ఈ తంతును స్థానికులు వీడియో తీసి వైరల్ చేయడంతో విషయం టూటౌన్ సీఐ యువరాజు దృష్టికి వెళ్లింది. దీనిపై స్థానిక జడ్పీ హైస్కూల్ హెచ్ఎంను, ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థి గురించి ఆచూకీ తీశారు. దాడి చేసిన ముగ్గురు యువకులు స్థానిక రామారావుకాలనీకి చెందిన వారిగా పోలీసులు అనుమానిస్తున్నారు. సీఐ యువరాజు మాట్లాడుతూ బాధితుడి నుంచి తమకు ఫిర్యాదు అందలేదన్నారు. అయినా గురువారం జడ్పీ హైస్కూల్‌కు వెళ్లి విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇస్తామని సీఐ చెప్పారు.

మెడికల్ కాలేజిలో 267 పోస్టులు భర్తీ

- రెకమండేషన్లకే ప్రాధాన్యం..?
- అర్హులకు అన్యాయం జరిగిందన్న ఆరోపణలు

మదనపల్లె టౌన్, మార్చి 13: మదనపల్లె ప్రభుత్వ మెడికల్ కాలేజికి సంబంధించి 267 పోస్టులను భర్తీ చేస్తూ అభ్యర్థులకు నియామకపత్రాలు అందాయి. ఈ పోస్టుల నియామకంలో ఓ అధికార పార్టీ ప్రజాప్రతినిధి రెకమండేషన్లకే ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మదనపల్లె మెడికల్ కాలేజికి అవసరమైన 13 కేటగిరీల్లో 65 పోస్టులు, జనరల్ హాస్పిటల్‌కు అనుసంధానంగా 33 కేటగిరీల్లో 202 పోస్టులకు మెడికల్ కాలేజి (ప్రభుత్వం) నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా 267 పోస్టులకు గాను జనవరి 8 నుంచి 14వ తేదీ వరకు 5750 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను మెంటర్ కాలేజి అయిన తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజికి పంపారు. అప్పటి నుంచి ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అభ్యర్థులకు బుధవారం నియామకపత్రాలు అందినట్లు తెలిసింది. కాగా ఎక్కువశాతం అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి సిఫార్సులతోనే ఈ పోస్టింగులు వచ్చాయన్న ఆరోపణలు వస్తున్నాయి. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సైక్రియాటిక్ సోషల్ వర్కర్ పోస్టుకు 15 ఏళ్ల అనుభవం ఉన్న దీప్తి అనే మహిళ దరఖాస్తు చేసుకోగా కేవలం ఆరు నెలల అనుభవం ఉన్న మరో మహిళకు ఈ పోస్టుకు నియామక ఉత్తర్వులు వచ్చినట్లు సమాచారం. దీంతో పలువురు అర్హులైన వారు రాయచోటిలో కలెక్టర్‌ను కలసి తమ బాధను వెళ్లగక్కనున్నట్లు తెలిసింది.

మెరిట్ ప్రకారం నాకే వస్తుందనుకున్నా..

15 ఏళ్లుగా మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో సైక్రియాటిక్ సోషల్ వర్కర్‌గా పనిచేస్తున్నా. నా ఉద్యోగానికి అర్హత సర్టిఫికెట్లు, 15 ఏళ్ల అనుభవం కలిపి 87 మార్కులు వస్తాయి. ఉన్న ఒకే ఒక పోస్టు మెరిట్ లేని మరో మహిళకు వచ్చింది. నాకు జరిగిన అన్యాయంపై రాయచోటిలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇస్తాను.

\- దీప్తి, సైక్రియాటిక్ సోషల్ వర్కర్, మదనపల్లె ప్రభుత్వాస్పత్రి

చీటీల స్కాంలో ముగ్గురు నిందితులపై కేసు నమోదు

మదనపల్లె, మార్చి 13: మదనపల్లెలో సంచలనం సృష్టించిన చీటీల స్కాం కేసులో ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ యు.వలిబాషా తెలిపారు. ఈ స్కాంకు సంబంధించిన వివరాలను సీఐ బుధవారం మీడియాకు వివరించారు. చీటీలు వేసి మోసపోయామని మూడు రోజులుగా బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వస్తున్నారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు చిట్‌ఫండ్ నిర్వాహకులు వి.సుధాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బాషాపై చిట్‌ఫండ్ యాక్టు, చీటింగ్ కేసు నమోదు చేశారు. చీటీలతో వందలాది మంది మోసపోయినట్లు చెబుతున్నా ప్రస్తుతం 50 మంది ఫిర్యాదు చేయడానికి ముందుకొచ్చారు. గాంధీపురానికి చెందిన వై.విజయకుమారి ఫిర్యాదు ఆధారంగా నిందితులపై 420 రెడ్‌విత్ 34, ఐపీసీ 68 ఏపీసీఎఫ్‌ఏ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇంకా వీరి వద్ద చీటీలు వేసి నష్టపోయామని బాధితులు వస్తే విచారణ చేపట్టి కేసు నమోదు చేసి సాక్ష్యాల కింద పేర్లు నమోదు చేయడంతో పాటు న్యాయం చేస్తామన్నారు. అనధికారిక చీటీల కారణంగా నష్టం కలిగినట్లు తమ దృష్టికి తెస్తే న్యాయం చేస్తామని సీఐ హామీ ఇచ్చారు. ఈ చీటీల స్కామ్‌లో ఎంత మంది ఉన్నారు? బాధితులు ఇంకా ఎంతమంది ఉన్నారు? ఎంత నష్టపోయారో లోతుగా విచారణ చేస్తున్నట్లు సీఐ వివరించారు.

మదనపల్లె మార్కెట్ రూ.1.13 కోట్లు

- *వేలం పాటలో దక్కించుకున్న కాంట్రాక్టర్*

మదనపల్లె, మార్చి 13: మదనపల్లె మున్సిపాలిటీలో బుధవారం జరిగిన డైలీ మార్కెట్ వేలం పాటల్లో రూ.1.13 కోట్లు ఆదాయం లభించింది. ఏడాది పాటు గేటు వసూళ్లకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కె.ప్రమీల వేలం పాటలు నిర్వహించారు. ఇందులో ఇద్దరు కాంట్రాక్టర్లు ఎస్.యాస్మిన్, ఎస్.సత్తార్‌లు పోటీపడగా ఎస్.యాస్మిన్ హెచ్చుపాటతో టెండర్ దక్కించుకున్నారు. ఇదిలా ఉండగా గత ఏడాది ఇదే డైలీ మార్కెట్ రూ.1.30 కోట్లు పోగా ప్రస్తుతం రూ.1.13 కోట్లు పోయింది. గత ఏడాదితో పోలిస్తే ఇప్పుడు రూ.17లక్షలు తక్కువకు పోయింది. ఇదే మొత్తం 2022-23 ఏడాదిలో రూ.1.12 కోట్లు పోగా, దానిపై ఒక లక్ష పెంచి వేలం పాటను ముగించినట్లు తెలుస్తోంది. దీనిపై ఆమోదమా? తిరస్కారమా? అన్నది కౌన్సిల్ ముందుకు తేనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఇదే డైలీ మార్కెట్ పోటీలకు మరో ఇద్దరు పోటీకి రాగా డాక్యుమెంట్లు, ఆథరైజేషన్ సర్టిఫికెట్లు లేకపోవడంతో వేలం పాటలకు అనర్హులయ్యారు. డైలీ మార్కెట్ క్లియర్ కాగా, దినసరి కూరగాయల మార్కెట్, జంతువధశాల, మాంసం మార్కెట్, బెంగళూరు బస్టాండులో గేటు వసూళ్ల వేలం పాటలు గురువారం సాయంత్రానికి వాయిదా వేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం కావాలి

- స్వేచ్ఛాయుత ఎన్నికలకు కృషి చేయండి
- కలెక్టర్లు, ఎస్పీలకు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాలు

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 13: ఎలాంటి హింసాత్మక సంఘటనలు రీపోల్‌కు చోటు లేని ఎన్నికలే లక్ష్యం కావాలని, స్వేచ్ఛాయుత ప్రశాంత వాతావరణ ఎన్నికలకు కృషి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. బుధవారం సాయంత్రం విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఎన్నికల నిర్వహణ, సంసిద్ధత, చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, ఎస్పీ కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయగానే మోడల్‌కోడ్ మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాలన్నారు. నగదు, మద్యం రవాణా, మెటల్ వస్తువుల రవాణాపై నిఘా పటిష్టం చేయాలన్నారు. అలాగే బోర్డర్ పాయింట్స్‌లోని చెక్‌పోస్టుల్లో కూడా నిఘా పెంచాలని సూచించారు. ఎంసీఎంసీ, ఫ్లయింగ్, సర్వైవలెన్స్, వీడియో, పోలీసు బృందాలు 24/7 అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకుల నుంచి లక్షకు పైగా విత్‌డ్రా చేసే వ్యక్తిగత, డిపెండెన్స్, రాజకీయ పార్టీల ఖాతాలు, ఆర్‌టీజీఎస్ ద్వారా ఒకరి నుంచి ఎక్కువ మందికి జరిపే నగదు లావాదేవీలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రోజు వారీ మద్యం అమ్మకాలపై నిఘా ఉంచాలన్నారు. గత ఏడాది ఇదే సమయానికి జరిగిన మద్యం అమ్మకాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం రోజువారీ 30 శాతం పెరిగిన మద్యం అమ్మకాలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. విస్తృతంగా తనిఖీలు నిర్వహించి రూ.50 వేలకు మించిన నగదు, రూ.10 వేలకు మించిన వస్తువుల రవాణాను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్లు, ఎస్పీలు 24/7 పనిచేసేలా కమాండ్ కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి వాటి గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో సత్యనారాయణరావు, ఎస్డీసీ వెంకటసుబ్బయ్య, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో భార్య చేతిలో భర్త హతం

ఓబులవారిపల్లె, మార్చి 13: మండలంలోని మంగంపేట ఆర్‌ఆర్-1 సెంటర్ 4వ వీధిలో క్షణికావేశంలో భార్య చేతిలో భర్త మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ చిన్నపెద్దయ్య వివరాల మేరకు... కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులోని గువ్వలదొడ్డికి చెందిన బోయ తిమ్మప్ప (40) ఇరవై ఏళ్ల క్రితం మంగంపేటకు వచ్చి బేల్దారి పనులు చేసుకుంటూ ఉండేవాడు. స్థానికంగా బోయ నరసమ్మను వివాహం చేసుకుని ఇక్కడే స్థిరపడ్డాడు. నరసమ్మ ఏపీఎండీసీలో కాంట్రాక్టు పద్ధతిన స్వీపర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం ఉన్నారు. ఇంట్లో భార్యాభర్తల మధ్య ఘర్షణ జరుగుతుండగా, క్షణికావేశానికి గురైన భార్య ఇనుప ఆయుధంతో మోది అనంతరం కత్తితో దాడి చేయడంతో తిమ్మప్పకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు రైల్వేకోడూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్‌సిటీ రైలులో వృద్ధుడు మృతి



ఎర్రగుంట్ల, మార్చి 13: తిరుపతి-హుబ్లీ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైల్లో గుర్తు తెలియని వృద్ధుడు మరణించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి సుమారు 55 నుంచి 60 ఏళ్లు ఉండవచ్చునన్నారు. నల్లటి గీతల షర్టు, నల్లని ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. అలాగే కుడిచేతికి అంజనేయస్వామి బొమ్మ పచ్చబొట్టు ఉందన్నారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాల్లేవన్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే ఎర్రగుంట్ల రైల్వే ఎస్‌ఐ సెల్ నెంబరు 9440627658కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మనస్థాపంతో ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న రాజారెడ్డి

జమ్మలమడుగు, మార్చి 13: జమ్మలమడుగులో మంగళవారం రాత్రి మైలవరం మండలం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నెమలి రాజగోపాల్‌రెడ్డి తాడిపత్రి రోడ్డులో పురుగుల మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. వెంటనే స్థానికులు బాధితుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దేవగుడి భూపేశ్‌రెడ్డికి జమ్మలమడుగు టీడీపీ టిక్కెట్ ఇవ్వకుండా బీజేపీకి కేటాయిస్తారేమోనని మనస్థాపంతో పురుగుల మందు తాగినట్లు బాధితుడు తెలిపాడు. మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

ప్రైవేటు వ్యక్తులతో సబ్‌స్టేషన్లు నిర్వహించొద్దు

ఎస్‌ఈకి విద్యుత్ ఉద్యోగ సంఘం నాయకుల వినతి



ఎస్‌ఈ రమణకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కడప (నాగరాజుపేట), మార్చి 13: విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోపెట్టి నిర్వహించాలనుకోవడం సరికాదని విద్యుత్ ఉద్యోగ సంఘం నాయకులు సుదర్శన్‌రెడ్డి, వీసీ క్రిష్ణయ్యలు తెలిపారు. బుధవారం విద్యుత్ భవన్‌లో విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రమణను కలిసి విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రొద్దుటూరు పట్టణంలో మూడు డివిజన్‌లలో విద్యుత్ సబ్‌స్టేషన్లు ప్రైవేటు వ్యక్తులతో నడపాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు. వెంటనే ఆ ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో విద్యుత్ ఉద్యోగులు పనిచేస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చినందువల్ల సంస్థలో పనిచేస్తున్న వయసుపైబడ్డ లైన్‌మెన్లకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. అలాగే ప్రైవేటు వ్యక్తుల నిర్వహణ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. హడావుడిగా ఎటువంటి నియామక ప్రక్రియ చేపట్టకుండా 12 మంది షిఫ్ట్ ఆపరేటర్లను ఎలా ఎంపిక చేశారని ప్రశ్నించారు. ఈ విషయమై ఉన్నత న్యాయస్థానంలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగ సంఘం నాయకులు పురుషోత్తం, వెంకటచలపతి, మురళి, ఫయాజ్‌బాషా పాల్గొన్నారు.

రాజ్యాంగ విరుద్ధమైన సీఏఏను అమలు కానివ్వం

రౌండ్‌టేబుల్ సమావేశంలో రాజ్యాంగ పరిరక్షణ కమిటీ నాయకులు



మాట్లాడుతున్న ఆర్‌సీపీ నాయకుడు రవిశంకర్‌రెడ్డి

కడప (నాగరాజుపేట), మార్చి 13 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ విరుద్ధమైన పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) అమలు కానివ్వమని రాజ్యాంగ పరి రక్షణ కమిటీ నాయకులు తెలిపారు. బుధవారం నగరంలోని అజ్మత్ షాదీఖానాలో రాజ్యాంగ పరిరక్షణ కమిటీ నాయకులు, ఎన్ఆర్సీ జేఏసీ కన్వీనరు అహ్మద్‌బాయ్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్‌సీపీ నాయకుడు రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రం తీసుకువచ్చిన నల్లచట్టాలను ఇప్పటి వరకు కేరళతో సహా ఐదు రాష్ట్రాలు వ్యతిరేకించాయని, ఇదే క్రమంలో మన ప్రభుత్వం కూడా వ్యతిరేకించి తీరాలన్నారు. సీఏఏ చట్టాన్ని రద్దు చేసే వరకు పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లెల భాస్కర్, ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బుల్‌బాషా, హిల్స్ ఆఫ్ రాష్ట్ర నాయకులు బాదుల్లా, సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్, ఎంఆర్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై ఎంపీడీవో ఫిర్యాదు



హెచ్‌సీకి ఫిర్యాదు చేస్తున్న ఎంపీడీవో

పెండ్లిమర్రి, మార్చి 13: గొందిపల్లె గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఖలీల్ తనను బెదిరిస్తున్నాడంటూ ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. గొందిపల్లె గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఖలీల్ మంగళవారం రాత్రి 9 గంటలకు తన వాట్సాప్ నెంబరుకు అసభ్యపదజాలంతో మెసేజ్‌లు చేశాడన్నారు. నీకు రేపే లాస్ట్ డే అని వార్నింగ్ ఇచ్చాడని అనంతరం ఆ మెసేజ్‌లు డిలీట్ చేశాడన్నారు. మళ్లీ బుధవారం పంచాయతీ కార్యదర్శులతో మోడల్ కోడ్ కాండక్ట్ సమావేశం జరుపుతున్న సమయంలో అతను చాంబర్‌కు కత్తి తీసుకొని వచ్చి బెదిరించబోయాడన్నారు. ఈ మేరకు అతడిపై కేసు ఫైల్ చేయాలని పోలీసులకు ఫిర్యాదు అందించారు.

ఆర్టీపీపీ కొత్త సీఈగా గౌరీపతి

ఎర్రగుంట్ల, మార్చి 13: డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీ చీఫ్ ఇంజనీర్‌గా విద్యుత్ సౌధలో పనిచేస్తున్న గౌరీపతి నియమితులయ్యారు. ఒకటి రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు తీసుకోనున్నట్లు సమాచారం. ఇక్కడ సీఈగా పనిచేస్తున్న టి.నాగరాజు విజయవాడ వీటీపీఎస్‌కు బదిలీ అయ్యారు. ఈయన సుమారు సంవత్సర కాలంగా ఇక్కడ సీఈగా విధులు నిర్వహించారు. ఈ మేరకు ఏపీ జెన్‌కో ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు విడుదల అయ్యాయి. ఆయన బుధవారం సాయంత్రం రిలీవ్ అయినట్లు సమాచారం. అలాగే ఇక్కడికి అప్పటి వరకు ఎస్‌ఈ సోమశేఖర్‌రెడ్డి ఇన్‌చార్జి సీఈగా పనిచేస్తారని తెలిసింది.

నేటి నుంచి సెమిస్టరు పరీక్షలు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 13 : కడప నగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో గురువారం నుంచి 24వ తేదీ వరకు సెమిస్టరు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైస్ చాన్సలర్, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు అంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ప్రొఫెసరు సురేంద్రనాథరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్ ఇంటీరియర్ డిజైన్ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లోని పెయింటింగ్, ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్, యానిమేషన్, కల్చర్ విభాగాలకు పరీక్షలు జరుగుతాయన్నారు.

సామాజిక తనిఖీ సర్వే వేగంగా పూర్తి చేయండి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 13: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈవో అనురాధ, సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీ సర్వే కార్యక్రమాన్ని ఈనెల 15వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ, జడ్పీ, కస్తూర్బా, గురుకుల సంక్షేమ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీతో చర్చించి సంబంధిత యాప్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఇప్పటికే మాస్టర్ ట్రైనర్స్‌తో అన్ని మండలాల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చామన్నారు. ఎంఈవోలు వారి పరిధిలోని అన్ని మండలాల్లో సర్వే పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని చెప్పారు.


అభివృద్ధి కథ కంచికేనా..?

- బద్వేలు మున్సిపాలిటీలో ఆగిన పనులు
- బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ల వెనకడుగు?
- రూ.130 కోట్ల నిధులలో సగం కూడా ఖర్చు కాని వైనం
- ఎన్నికలు సమీపిస్తున్నాయి.. ఇక పనులు అనుమానమే

బద్వేలు పట్టణం మున్సిపాలిటీగా పురోగతి చెంది 14 సంవత్సరాలైంది. ఇన్నేళ్లయినా మున్సిపాలిటీ అభివృద్ధి మాత్రం నత్తనడకన సాగుతోంది. జిల్లాలో సీఎం సొంత నియోజకవర్గం పులివెందుల తరువాత ఏ మున్సిపాలిటీకి దక్కని అదృష్టం బద్వేలు మున్సిపాలిటీని వరించింది. ఉపఎన్నికలు రావడంతో బద్వేలు మున్సిపాలిటీని రూ.130 కోట్లతో అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించారు. ఆ మేరకు అక్కడ ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థే ఎమ్మెల్యేగా గెలిచారు. రెండేళ్లు దాటినా అభివృద్ధి పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. రూ.130 కోట్ల నిధులకు గాను కేవలం రూ.47 కోట్లు మాత్రమే వినియోగించి పనులు చేశారని అంటున్నారు. త్వరలో ఎన్నికలు రానుండటంతో ఇక అభివృద్ధి పనుల కథ కంచికే అని పలువురు విమర్శిస్తున్నారు.



బద్వేలు టౌన్, మార్చి 13: బద్వేలు మున్సిపాలిటీలో మొత్తం 35 వార్డులున్నాయి. వీటిలో కొన్నింటిలో మాత్రమే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఎక్కడ చూసినా రోడ్లు, మురుగునీటి కాల్వలు అధ్వాన్నంగా ఉన్నాయి. రూ.130 కోట్ల నిధులు విడుదల చేసినప్పటికీ ఒక్క పేరుతోనే కాంట్రాక్టు వేసి సబ్ కాంట్రాక్టు కింద కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు పనులు చేపట్టారు. వీరు అప్పులుతెచ్చి పనులు చేస్తున్నప్పటికీ నెలల తరబడి బిలులు రాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండడంతో కాంట్రాక్టర్లు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. తమకు బిల్లులు చెల్లించాలని వీరు పట్టుబడుతున్నారని సమాచారం. బిల్లులు మంజూరులో రోజురోజుకూ జాప్యం అవుతుండడంతో అప్పులు తెచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక కాంట్రాక్టర్లు సతమతమవుతున్నారని అంటున్నారు. సార్వత్రిక ఎన్నికల గడువు సమీపించి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయం ఆసన్నం కావడంతో అభివృద్ధి పనులు ఇక జరగవని ప్రజలు చర్చించుకుంటున్నారు. నిధులు మంజూరైనా వాటిని సద్వినియోగం చేసుకోవడంలో పాలకపక్షం విఫలమైందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నా అధికార వైసీపీలో ఇసుమంతైనా చలనం కలగడంలేదు. చేసిన పనులకు బిల్లులు మంజూరు కాలేదని, కాంట్రాక్టర్లు చేతులెత్తేయడంతో మిగిలిన పనులు పూర్తి చేయలేని స్థితిలో పాలకపక్షం ఉందని సమాచారం.



జనావాసాలు లేని చోట దర్శనమిస్తున్న సీసీ రోడ్డు

వైసీపీ నేతల పొలాలకు సిమెంటు రోడ్లు

బద్వేలు మున్సిపాలిటీకి రూ.130 కోట్లు మంజూరు కాగా.. రెండు సంవత్సరాల కిందట రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టినా మున్సిపల్ పాలకవర్గం కేవలం రూ.47 కోట్లు మాత్రమే వినియోగించుకోగలిగింది. బద్వేలు మున్సిపల్ పరిధిలోని గుంతపల్లె గ్రామం నుంచి చెన్నంపల్లె వెళ్లే దారిలో సిమంటు రోడ్డు నిర్మాణాలు చేపట్టారు. ఆ దారి వెంట ఎక్కడ చూసినా నివాస ప్రాంతాలు లేవు. మిద్దెలపాలెం నుంచి రఘునాథపురం వెళ్లే దారిలో వైసీపీ నేతల పొలాలకు సిమెంటు రోడ్లు వేసుకోవడంతో ప్రజలు అవాక్కవుతున్నారు. అలాగే మార్తోమనగర్ సమీపంలోని జనసంచారం లేని ప్రాంతాల్లో కూడా సిమెంటు రోడ్ల నిర్మాణాలు చేపట్టారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మున్సిపాలిటీ పరిధిలో ఎక్కువ జనాభా 33వ వార్డు గాండ్లవీధి, రెడ్డయ్యమఠం వీధి, 13వవార్డు శివానగర్, మహబూబ్‌నగర్‌లో ఉంది. ఆ రెండు వార్డుల్లో టీడీపీ కౌన్సిలర్లు గెలుపొందారు. ఆ రెండు వార్డుల్లోనూ రోడ్ల నిర్మాణాలకు టెండర్లూ పిలవలేదు.. పనులూ చేపట్టలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే కొన్ని వార్డుల్లో సిమెంటు రోడ్లు దెబ్బతిన్నాయి. చాలా వార్డుల్లో మట్టితేలిన రోడ్లు, మురుగు కాల్వలు ప్రత్యేకంగా దర్శనమిస్తున్నప్పటికీ పాలకపక్షానికి, అధికారులకు నిమ్మకునీరెత్తినట్లు కూడా లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



మహబూబ్‌నగర్‌లో దయనీయ స్థితిలో రహదారి



అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ



సీసీ రోడ్లు వేయాలి..

33వ వార్డులోని గాండ్లవీధి, రెడ్డయ్యమఠం వీధుల్లో జనాభా ఎక్కువ. ఇక్కడ టీడీపీ గెలుపొందడంతో పాలకవర్గం ఈ వీధుల్లో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడం చాలా బాధాకరం. ఎన్నికల నోటిఫికేషన్ వస్తుండడంతో మాకు రోడ్లు వేసేది అనుమానమే.

- ఎం.ప్రసాద్, 33వ వార్డు

అనేకమార్లు విన్నవించినా...

మహబూబ్‌నగర్, శివానగర్‌లలో సిమెంటు రోడ్లు వేయాలని, మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని అనేకమార్లు అధికారులకు, పాలకవర్గానికి విన్నవించాం. అయినా ఇంత వరకు ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేయకపోవడం దారుణం.

- నాగార్జున, శివానగర్



ఆలయ నిర్మాణాలు భక్తి భావాన్ని కలిగిస్తాయి



కలెక్టర్లు, ప్రభుత్వ కార్యదర్శులను సన్మానిస్తున్న దృశ్యం

సంబేపల్లె, మార్చి 13: గ్రామీణ ప్రాంతాల్లో ఆలయ నిర్మాణాలు ప్రజల్లో భక్తిభావాన్ని కలిగిస్తాయని అన్నమయ్య, కడప జిల్లాల కలెక్టర్‌లు అభిషిక్త్‌కిశోర్, విజయరామరాజు, రాష్ట్ర వైద్యసేవల శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ హరిజవహర్‌లాల్, అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బుధవారం సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామం పెద్దబిడికిలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత నూతన విగ్రహావిష్కరణ, ధ్వజస్థంభ ప్రతిష్ఠ కార్యక్రమాలకు వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజలు ముఖ్య అతిథులకు ఘనంగా స్వాగతం పలికారు.

అనంతరం వారు నూతన విగ్రహావిష్కరణ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను ప్రారంభించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మండపంలో ముఖ్య అతిథులకు ఆలయ అర్చకులు వేదాశ్వీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గ్రామీణాభివృద్ధిలో భాగంగా ఆలయం సమీపంలో ఉన్న చెరువులో ఉపాధి హామీ పథకం ద్వారా పర్కులేషన్ ట్యాంకు, ట్యాంక్ బండ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ డ్వామా పీడీకి ఆదేశాలు జారీ చేశారు. పెద్దబిడికి గ్రామ అభివృద్ధికి సంబంధించి వివిధ అంశాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, రాయచోటి ఆర్డీవో రంగస్వామి, డ్వామా పీడీ మద్దిలేటి, అన్నమయ్య జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్, సంబేపల్లె తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో నిర్మలాదేవి, గ్రామంలోని ప్రముఖ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఏప్రిల్‌లో వైవీయూ కాన్వొకేషన్

- 21 వరకు దరఖాస్తుల స్వీకరణ : వీసీ

కడప (ఎడ్యుకేషన్), మార్చి 13 : వైవీయూ కాన్వొకేషన్ ఏప్రిల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ తెలిపారు. కాన్వొకేషన్ నిర్వహణలో భాగంగా రిజిస్ట్రార్ ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి, ఇంజనీరు రాజశేఖర్‌రెడ్డితో కలిసి యూనివర్శిటీలో వేదిక నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీయూ 11, 12, 13 కాన్వొకేషన్ ఏప్రిల్ నెలలో నిర్వహిస్తున్నామన్నారు. 2023 విద్యాసంవత్సరానికి ముందు ఉత్తీర్ణులైన విద్యార్థులు కాన్వొకేషన్‌లో పట్టాలు పొందేందుకు ఈనెల 21వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వైవీయూ అనుబంధ కళాశాలల్లో 2023కు ముందు పీజీ, డిగ్రీ, బీఈడీ, ఎంఈడీ, ఎంటెక్, లా ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ కాన్వొకేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీహెచ్‌డీ అవార్డు అయిన వారు నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులందరూ ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. దరఖాస్తు సమయంలో సందేహ నివృత్తి కోసం హెల్ప్‌లైన్ నెంబర్ 9705812613ను ఏర్పాటు చేశామన్నారు. 43 మంది మెరిటోరియస్ స్టూడెంట్స్‌కు గోల్డ్‌మెడల్స్ ఇవ్వనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ విభాగం డీన్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, పూర్వకుల సచివులు ప్రొఫెసరు డి.విజయరాఘవప్రసాద్, ప్రొఫెసరు వై.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

కడప (ఎడ్యుకేషన్), మార్చి 13 : సమాజంలోని అణగారిన వర్గాలకు అన్ని రంగాల్లో సమున్నత స్థానంతో పాటు వారి అభ్యున్నతే లక్ష్యంగా పీఎం సూరజ్ పోర్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక రుణసాయం అందిస్తోందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వెంకటసుబ్బయ్య, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి తెలిపారు. బుధవారం ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వర్చువల్ విధానం ద్వారా ప్రధానమంత్రి సామాజిక్ ఉద్ధాన్, రోజ్‌గార్ ఆధారిత్ జనకళ్యాణ్ జాతీయ పోర్టల్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా ప్రారంభించారు. పలు కేంద్ర సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన లక్ష మంది వెనుకబడిన వర్గాల పారిశ్రామికవేత్తలకు రుణసాయాన్ని పోర్టల్ ద్వారా మంజూరు చేశారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య, సరస్వతి మాట్లాడుతూ ఈ పోర్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అణగారిన వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ వారి ఆర్థిక శ్రేయస్సుకు సామాజిక అభివృద్ధికి తోడ్పాటునివ్వడం ప్రధాని మోదీ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. ప్రభుత్వాలందించే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖకు చెందిన అధికారులు,, డీఆర్‌డీఏ అధికారులు, ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనొద్దు : ఐసీడీఎస్ పీడీ

ప్రొద్దుటూరు, మార్చి 13: అంగన్వాడీ సూపర్‌వైజర్లు, వర్కర్లు, హెల్పర్లు ఎన్నికల ప్రచారాలకు దూరంగా ఉండాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా మాత్రమే సేవలు అందించాలి తప్ప పార్టీ ప్రచారాల్లో పాల్గొంటే తీవ్ర ఇబ్బందులు తప్పవని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక ఎన్జీవో హోంలో అర్బన్ ఐసీడీఎస్ సీడీపీవో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బందితో పీడీ శ్రీలక్ష్మి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ పౌష్టికాహార కిట్లను అంగన్వాడీ కేంద్రాలలో గానీ వర్కర్స్ ఇళ్లలో గానీ పెట్టుకోకూడదని విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారుల తనిఖీల్లో బయటపడ్డాయంటే మిమ్మల్ని ఎవ్వరూ కాపాడలేరని హెచ్చరించారు. కిట్లను వెంటనే లబ్ధిదారులకు పంచిపెట్టాలన్నారు. అంతేకాని అవి కేంద్రాల్లో ఉన్నా, మీ ఇళ్ళలో పెట్టుకున్నా కేసులు పెడతారన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఫేస్ యాప్‌లలో అన్నీ నమోదు చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో హాజరు ఏ రోజుకారోజు లేకుంటే మెమోలు జారీ చేస్తామన్నారు. ప్రొద్దుటూరు అర్బన్‌లో వున్న అన్ని కేంద్రాలు అద్దె భవనాల్లో నడుపుతున్నారని, అవి చాలా ఘోరంగా ఉన్నాయన్నారు. మీరైతే అలాంటి ఇళ్లలో ఉంటారా అని ప్రశ్నించారు. ఇవన్నీ పరిశుభ్రంగా పెట్టుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సొంత ఇళ్లలో పెట్టుకుని అద్దె తీసుకుంటే వారి అద్దె రికవరీతో పాటు వారిపై చర్యలు తప్పవని తెలిపారు. రాజకీయ పార్టీలు ఇచ్చే తాయిలాలు తీసుకుంటే తీవ్రమైన చర్యలు ఉంటాయన్నారు. సీడీపీవో హైమావతి మాట్లాడుతూ ప్రతి సెంటర్ 2 గంటల తర్వాత మూసేస్తున్నారని 4 గంటల వరకు పెట్టుకోని తీరాలన్నారు. విజిట్‌కు వచ్చినప్పుడు సెంటర్ మూసివుంటే చర్యలు తప్పవన్నారు.

గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు



స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న పురుషోత్తంరాజు

ఒంటిమిట్ట,మార్చి13: గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఐ పురుషోత్తంరాజు అన్నారు. బుధవారం పల్లె నిద్రలో భాగంగా కుడుమలూరు గ్రామంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్థానిక ప్రజలతో పోలీసులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో నిర్భయంగా తమకు నచ్చిన పార్టీకి ఓటు వేసుకోవాలని గ్రామాల్లో విభేధాలు సృష్టించుకొని జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు. ఎన్నికల్లో మద్యం డబ్బు వంటి వాటిపై పోలీసుల్నిగా ఉంటుందని అక్రమాలకు పాల్పడకుండా నిర్భయంగా చారిత్రక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకొని కుటుంబ సభ్యులతో గడపాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ నారాయణ, ఎస్‌బి సుబ్బారెడ్డి పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

39 మంది ఉద్యోగాలకు ఎంపిక



కళాశాల నుంచి ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులు

రైల్వేకోడూరు, మార్చి 13: రాజంపేటలో పలు ప్రైవేటు కంపెనీలు జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ మేళాలో పలు కళాశాలల నుంచి విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో భాగంగా రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బీకాం విద్యార్థిని, విద్యార్థులు 39 మంది పాల్గొనగా, అందరూ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.నాగరాజునాయుడు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రమేష్‌లు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులు పేటీఎం, అమెజాన్, యంగ్ ఇండియా కంపెనీలలో పనిచేయడానికి ఆయా కంపెనీలు అంగీకరించాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జి.శివయ్య, ఆర్ఆర్‌సీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రేమలత, ఇండస్ట్రీ కో-ఆర్డినేటర్ దాసరి మోషే, అధ్యాపకులు జి.శ్రీనివాసులు, డి.వెంకటేశ్వర్లు, ఎస్.విశ్వనాథ్, ఆర్.వెంకటరమణ, జి.సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ సరుకులు పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

రైల్వేకోడూరు(రూరల్), మార్చి 13: కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని 50 నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ రేషన్ కిట్లను సొసైటీ చైర్మన్ షేక్ మస్తాన్‌సాహెబ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ ఉపవాస దీక్షలుండే ముస్లిం కుటుంబాలకు ఒక రైస్ బ్యాగ్, కందిపప్పు, నూనె, మంచిపప్పులు, చెనిక్కాయపప్పులు, ఉల్లిగడ్డలు, గోధుమపిండి, చింతపండు వంటి 19 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు డ్రైవర్ బాషా, ఎలక్ట్రీషియన్ షాహిర్, మహమ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న మానవత సభ్యులు

చిట్వేలి, మార్చి 13: ఇష్టంగా చదివితే ఉజ్వల భవిష్యత్తు విద్యార్థుల సొంతమని పలువురు మానవతా సభ్యులు విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు మానవత శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కె.కందులవారిపల్లె, కస్తూర్బా, వెంకటరాజుపల్లె, నాగవరం, హైస్కూల్‌లో విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం చిట్వేలి జడ్పీ ఉన్నత పాఠశాలలో 288 మంది పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. అనంతరం మానవతా సభ్యులు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మంచి మార్కులు పొంది మండలానికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సాయిరాం, కార్యదర్శి మునిరావు, డైరెక్టర్ బోర్డ్ అధ్యక్షుడు విశ్వనాధం, సలహాదారులు ఉమామహేశ్వర్‌రెడ్డి, గంగిరెడ్డి, జానీ, సుధీర్‌రెడ్డి, బాలసుబ్రమణ్యంరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తంరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



అటవీ ప్రాంతంలో వ్యర్థ పదార్థాలు తొలగిస్తున్న ఆలయ సిబ్బంది

సిద్దవటం, మార్చి 13: మండలంలోని వంతాటిపల్లె పంచాయతీ లంకమల అడవుల్లో వెలసిన నిత్యపూజస్వామి దేవస్థాన ఆవరణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించినట్లు ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా నిత్యపూజస్వామిని దర్శించుకున్న భక్తులకు పంచలింగాల వద్ద దాతలు అన్నదాన కార్యక్రమాలను విరివిగా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో వన్యప్రాణులను దృష్టిలో ఉంచుకొని పంచలింగాల ఆవరణంలో, నిత్యపూజస్వామి దేవస్థానం ఆవరణంలో భక్తులు పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, విస్తరాకులు, వాటర్‌ప్యాకెట్లు తదితర ప్లాస్టిక్ వ్యర్థాలను అటవీశాఖ వారి పర్యవేక్షణలో ప్రధాన రహదారి, వంకలో, కోనేరు వద్ద కూలీలతో శుభ్రం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొండారెడ్డి, సిబ్బంది చంద్ర పాల్గొన్నారు.

మొల్ల జీవితం.. మహిళలకు ఆదర్శం



రాయచోటిలో మొల్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో, సిద్దవటంలో నివాళులర్పిస్తున్న కమాండెంటు రవిశంకర్

● డీఆర్‌ఓ సత్యనారాయణ

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 13: మొల్ల జీవితం మహిళా లోకానికి ఆదర్శమని, రామాయణాన్ని సరళ భాషలోకి అనువదించిన ఘనత ఆమెకే దక్కుతుందని జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి సందప్ప ఆధ్వర్యంలో మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఆర్వో సత్యనారాయణ హాజరై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ తాళ్లపాక అన్నమయ్య (అన్నమాచార్య) భార్య తాళ్లపాక తిమ్మక్క తర్వాత చెప్పుకోదగ్గ రెండవ తెలుగు కవయిత్రి మొల్ల అని కీర్తించారు. అనంతరం వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి సందప్ప మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల శాఖ సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: మొల్ల జీవితం మహిళా లోకానికే ఆదర్శమని చిట్వేలి సీడీపీవో రాజేశ్వరి తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు కార్యాలయంలో తెలుగు కవయిత్రి మొల్ల జయంతి వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు గ్రేడ్-1 సూపర్‌వైజర్ వసుంధరమ్మ, గ్రేడ్-2 సూపర్‌వైజర్ సురేఖరాణి, జీఎంఎస్ కె.స్వర్ణలత, జ్యోతి పాల్గొన్నారు.

సిద్దవటం: భాకరాపేట పోలీసు బెటాలియన్‌లో బుధవారం కవయిత్రి మొల్ల జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 11వ బెటాలియన్ కమాండెంటు పి.రవిశంకర్ హాజరయ్యారు. కార్యక్రమంలో కమాండెంటు పి.రవిశంకర్, అడిషనల్ కమాండెంటు డి.నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంటు జయప్రసాద్, ఆర్ఎస్ఐలు, ఏఆర్ ఎస్ఐలు పాల్గొన్నారు.

నందలూరు: కలలకు కాణాచి అయిన కడప జిల్లాలో కవయిత్రి మొల్లమాంబ జన్మించడం జిల్లాకే గర్వకారణమని, ఆమె మహిళలందరికీ ఆదర్శమని సీనియర్ మెడికల్ ఆఫీసర్ లయన్ బచ్చు జయభాస్కర రావు తెలిపారు. అనంతరం మొల్ల చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో లయన్ కుర్రా మణియాదవ్, కొత్తపల్లి రాజాచారి, వాకర్ క్లబ్ ప్రెసిడెంట్ మోడపోతుల రాము, వాకర్స్ క్లబ్ ట్రెజరర్ గాడి సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రుడి బ్రహ్మోత్సవం

● హంసవాహనంపై భక్తులకు దర్శనం



వీరభద్రాలయంలో ఉత్సవ విగ్రహాలకు వసంతోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, మార్చి 13: దక్షిణ కాశీగా పేరుగాంచిన పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివారి మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణం, కంకణం విసర్జన, వసంతోత్సవ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి హంసవాహనంపై ఏర్పాటు చేసి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. హంసవాహనం సందర్భంగా నీలకంఠ్రావుపేటకు చెందిన బృందం చెక్కభజన కార్యక్రమం, భజన గురువు తుమ్మల హరినాధ ఆధ్వర్యంలో కోలాటం కార్యక్రమాలతో పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

రాయచోటి అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

● మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మండిపల్లి

రాయచోటిటౌన్, మార్చి 13: రాయచోటి అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని 9, 11, 12 వార్డుల్లో రెండవ రోజు ఇంటింట ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటిలో టీడీపీ గెలుపే లక్ష్యంగా ఇంటింటా ప్రచారం చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ఈ సందర్భంగా 9వ వార్డుకు చెందిన మహిళలు మాట్లాడుతూ వీధుల్లో మురికి కాలువలు ఉప్పొంగి రోడ్డుపైకి మురుగునీరు వచ్చి దుర్వాసనకు ప్రజలు రోగాల భారిన పడుతున్నా పట్టించుకోలేదన్నారు. ఈసారి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించుకుంటే మీ సమస్యలన్నీ తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువనాయకులు మండిపల్లి రాహుల్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, ప్రముఖ వ్యాపారవేత్త కోడి శ్రీను, బేపారి జాఫర్‌వలి, అల్లాబకాష్, సయ్యద్, నౌషాద్, జగదీశ్, గౌస్ సయ్యద్, యునెస్ ఖాన్ పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలతో ఆత్మీయ సమావేశం

పట్టణంలోని కొత్తపల్లె ప్రాంతంలో ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో రాంప్రసాద్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజలు సరైన రోడ్లు, డ్రైనేజీ కాలువలు, తాగునీరు లేక తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పేరుకే స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ అని చెప్పుకుంటూ ఎటువంటి మౌలిక సదుపాయాలు లేని విధంగా రాయచోటిని పాలించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నేతలు ఖాదర్‌మోద్దీన్, గీత బీడీ యజమాని నసీబ్‌జాన్, ఖాదర్ బాషా, సగీర్, అతావుల్లా, హలీమా, బీఎంకే రషీద్, షాహిదా, రహజాన్ బీబీజాన్, కరీ మున్నీషా, నజీరున్నీషా, షహనాద్, శిమీరున్నీషా, తాజున్, రషీదాబేగం పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: వైసీపీ అరాచక పాలనను అంతం చేసి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేద్దామని రాయచోటి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అనంతపురం గంగమ్మతల్లిని దర్శించుకున్నారు. అమ్మవారి పూజారులు, చెల్లువంశీయులు రాంప్రసాద్‌రెడ్డికి స్వాగతం పలికి అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించి దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం యనమలవాండ్లపల్లె, మాజీ ఎంపీటీసీ మదనమోహన్ ఇచ్చిన విందులో పాల్గొని విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ పాలనపై ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వందశాతం లక్ష్యసాధన దిశగా పనిచేయాలి



పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్

రాయచోటిటౌన్, మార్చి 13: అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో వందశాతం లక్ష్యాలు సాధించాలని జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణాధికారి (డీపీఎంవో) డాక్టర్ రియాజ్‌బేగ్ అన్నారు. జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అమలు, జాతీయ ఆరోగ్య మిషన్ నిధుల పర్యవేక్షణలో భాగంగా బుధవారం ఆయన రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని వాల్మీకివీధిలో గల పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ అందిస్తున్న ఆరోగ్య సేవల రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో ఎన్‌సీడీ, సీడీ సర్వే, ఆరోగ్యశ్రీలోని ఏఎన్ఎం ఫీడ్‌బ్యాక్, వెక్టార్ కంట్రోల్ హైజీన్‌ఆప్, ఆర్‌సీహెచ్ పోర్టల్ నిర్వహణ, అనీమియా ముక్త్‌భారత్, గ్రామ పారిశుధ్య, పోషణ, జన ఆరోగ్య సమితి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఖాతాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. వందశాతం లక్ష్య సాధనకు అనుగుణంగా పనిచేసి జిల్లాకు మంచిపేరు తేవాలని సిబ్బందిని కోరారు. ప్రతి సీహెచ్‌వోజన ఆరోగ్య సమితి ఖాతాలు యూనియన్ బ్యాంక్‌లో ఓపెన్ చేసుకుని, హెల్త్ వెల్లన్స్ సెంటర్‌కు కావాల్సిన విధంగా మార్గదర్శకాలను పాటిస్తూ నిధులు ఖర్చు చేయాల్సి ఉందని ఆదేశించారు. అనంతరం డ్రగ్స్ స్టోర్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

● ఏఐఎస్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలేశా

రాయచోటిటౌన్, మార్చి 13: జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులను హాల్‌టికెట్ల పేరుతో ఫీజుల దోపిడీని కొనసాగిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలేశా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మలుచుకుంటూ రకరకాల ఫీజుల పేరుతో నరకం చూపిస్తున్నారని ఆయన వాపోయారు. ఫీజులు కడితేనే హాల్‌టికెట్ ఇస్తామని తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులను ఇబ్బందులు పెట్టకుండా హాల్‌టికెట్లు ఇవ్వాలని, లేకుంటే ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.

కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలపై నేడు నిరసన

రాజంపేటటౌన్, మార్చి 13: కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు ప్రజావ్యతిరేక విధానాలపై వ్యతిరేకంగా గురువారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ నేతలు తెలిపారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రజావ్యతిరేకంగా పలు విధానాలను అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఒక వైపు దేశంలో పెట్రోలు, డీజల్ గ్యాస్ ధరలను పెంచేసి వ్యవసాయ పారిశ్రామిక రంగాలను నిర్వీర్యం చేసే విధంగా విధానాలను చేపడుతున్నారన్నారు. దేశ సంపదను అదాని, అంబానీల కార్పొరేట్ వ్యవస్థలకు కట్టబెడుతున్నారని వారు ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చారని, అదే విధంగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారన్నారు. నిరంకుశ పరిపాలన సాగిస్తున్న కేంద్ర బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దేవర, జి.నరసింహులు, జి.గంగయ్య, నాగేష్‌రావు పాల్గొన్నారు.

'ముక్కా' ఇంటి వద్ద వైసీపీ నేతల కవ్వింపు చర్యలు

● గడప గడపకు కార్యక్రమం పేరుతో హల్‌చల్



రూపానందరెడ్డి ఇంటివద్ద హల్‌చల్ చేస్తున్న వైసీపీ నేతలు

ఓబులవారిపల్లె, మార్చి 13: రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి ఇంటి వద్ద బుధవారం వైసీపీ నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. గడప గడపకు కార్యక్రమం పేరుతో వచ్చిన కొందరు వైసీపీ నేతలు ఆయన నివాసం వద్ద పదే పదే తిరుగుతూ హల్‌చల్ చేశారు. దీంతో అక్కడే ఉన్న టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఘర్షణలకు తావివ్వకుండా స్వయంగా రూపానందరెడ్డే తన అనుచర వర్గాన్ని శాంతింపజేశారు. ముక్కావారిపల్లె పాత హరిజనవాడకు వెళ్లేందుకు గ్రామం నుంచి దారి లేకపోయినా రూపానందరెడ్డి ఇంటి ముందు నుంచే వెళ్లేలా స్థానిక నాయకులు ప్రయత్నించారు. ఆయన ఇంటి వద్ద ఉన్న వ్యవసాయ భూమిని, వారి వాహనాలు పార్కింగ్ కొరకు వినియోగించుకునే స్థలంలో నుంచి వెళుతూ కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. పార్టీ ప్రచార రథంతో భారీ సౌండ్స్ చేస్తూ, డప్పులు మోగించడంతో పాటు కేకలు వేస్తూ రెచ్చగొట్టారు. టీడీపీ కార్యకర్తలకు, అనుచరులకు సంయమనం పాటించాలని ఇన్‌చార్జ్ సర్దిచెప్పారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకొని ఇలాంటి వారికి బుద్ధి చెప్పాలని సూచించారు.

ఎన్నికల సరళిపై అవగాహన ఉండాలి: ఆర్డీవో



బూత్ నమూనాను పరిశీలిస్తున్న రాజంపేట ఆర్డీవో టి.మోహన్‌రావు

రాజంపేట, మార్చి 13: ఓటర్లు ఎన్నికల వేళ ఏ విధంగా అనుసరించాలి, వాటిపై అవగాహన కలిగి ఉండాలని రాజంపేట ఆర్డీవో టి.మోహన్‌రావు తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన బూత్ నమూనాను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకునే విధంగా ఎలాంటి అనుమానాలు తావులేకుండా ఈ నమూనా ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఓటు వేసేందుకు మొదటగా పాటించాల్సిన విధానాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా ఏర్పాటు చేశారు. అలాగే ఈవీఎంలు ఏ విధంగా పనిచేస్తాయి, తమ ఓటు ఏ అభ్యర్థికి వెళ్లింది అనే వివరాలను తెలుసుకోవచ్చని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఇన్నానాథం, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాజాశరత్‌కు ఘన నివాళి

రాజంపేటటౌన్,మార్చి 13: పట్టణంలోని సాయిబాబా గుడి సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవీ సహృదయ సేవా ట్రస్ట్ సభ్యుడు రాజా శరత్‌బాబుకు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక సాయినగర్‌లోని సాయిబాబా గుడి ప్రాంగణంలో బుధవారం రాజాశరత్ బాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం పేదల ఆకలి తీరుస్తూ తనదైన శైలిలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించేవారన్నారు. సేవా గుణం కలిగిన శరత్ అకాల మరణం చెందడం బాధాకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శివరాజు, మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు అబ్దుల్లా, తుంగా రమణారెడ్డి, నందకిషోర్, వేణుగోపాల్‌నాయుడు, పి.వి.రమణ, రామచంద్రనాయుడు, హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు రమణ, వీహెచ్‌పీ నేత కాకర్ల రాముడు, న్యాయవాది రఘురామిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం నేతలు సుబ్బారావు, ఆడిటర్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో ప్రసాద్‌బాబు



అమ్మవారి సన్నిధిలో ప్రసాద్‌బాబు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 13: టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాదుబాబు బుధవారం మండలంలోని అనంతపురం గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జాతర మరుసటి రోజున అమ్మవారి చుట్టూ వున్న గ్రామాలు అమ్మవారికి ప్రత్యేకంగా బోనాలు సమర్పిస్తారు. ఈ కార్యక్రమానికి విచ్చేన ప్రసాదుబాబు గొల్లపల్లె, ఈడిగపల్లె గ్రామాల్లోని టీడీపీ కార్యకర్తలతో కలిసి విందు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును సీఎం చేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, మన్నేరు ఆంజనేయులు, సొండశెట్టి సురేంద్ర, బడిశెట్టి రవి, మనోహర్, సహదేవ, ముని తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి: సీఐ



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలతో సీఐ

రైల్వేకోడూరు (రూరల్), మార్చి 13: ప్రతిఒక్కరూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని రైల్వేకోడూరు సీఐ టి.బాబు కోరారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని రెడ్డివారిపల్లె, అగ్రహారం గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. గ్రామస్తులతో గతంలో జరిగిన పోలింగ్ సరళి గురించి చర్చించారు. ఎన్నికల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంత ఓటింగ్‌కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాలతో గడికోటలో నాకాబందీ

● ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలి:ఎస్ఐ

వీరబల్లి, మార్చి 13: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు ప్రతి ఒక్కరూ సహకరించాలని వీరబల్లి ఎస్ఐ చంద్రమోహన్ కోరారు. మండలంలోని గడికోటలో బుధవారం కేంద్ర బలగాలతో నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కవాతు నిర్వహించారు. అక్రమ మద్యం విక్రయించినా, అసాంఘిక కార్యక్రమాలు చేపట్టినా, ఎన్నికల్లో అల్లర్లు సృష్టించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఎవ్వరి ఓటు వారు వేసుకునేందుకు ఎటువంటి అల్లర్లు జరగకుండా ప్రత్యేకంగా ముందస్తుగా కేంద్ర బలగాలతో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

సమాజ్‌వాదీ పార్టీ కార్యాచరణపై సమావేశం

సిద్దవటం, మార్చి 13: సిద్దవటం సమాజ్‌వాదీ పార్టీ కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు భవనాసి వెంకట సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పార్టీ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు చర్చించారు. అనంతరం కడప జిల్లా అసెంబ్లీ అభ్యర్థుల సమక్షంలో పార్టీ గుర్తును తెలియజేశారు. ప్రతిఒక్కరూ గెలుపు దిశగా ముందుకెళ్లాలని పేర్కొన్నారు. పార్టీ గుర్తుపై ఉమ్మడి కడప జిల్లాలోని అసెంబ్లీ అభ్యర్థులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా కడప జిల్లాలోని అసెంబ్లీ అభ్యర్థులు పార్టీ కార్యక్రమాలు చేసుకొనేందుకు ప్రతిఒక్కరి సూచనలు, సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అభ్యర్థులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలి


కల్యాణ వేదిక వద్ద అనుగ్రహభాషణం చేస్తున్న కంచికామకోటి పీఠాధిపతి

ఐరాల(కాణిపాకం), మార్చి 13: మత మార్పిడులు చేయకుండా హిందువులు కలసి ఉండి, హిందూ ధర్మాన్ని కాపాడాలని కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి సూచించారు. ధర్మ కార్యకలాపాలలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఆయన బుధవారం సాయంత్రం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాణిపాక ఆలయం దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండి, మంచి పంటలు పండాలని స్వామిని కోరుకున్నట్లు తెలియజేశారు. కంచిపీఠం, కాణిపాకం అనుబంధంగా పౌరోహిత్యం, పద్ధతి పాఠశాలల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశుతో చర్చించారు. అనంతరం కల్యాణ వేదిక వద్ద అనుగ్రహభాషణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ జగన్నాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి, ఆలయ ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఉభయదారులు పాల్గొన్నారు.

మొగిలిలో వైభవంగా పష్పపల్లకి సేవ



బంగారుపాళ్యం, మార్చి 13: కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారు పుష్పపల్లకిపై భక్తులకు దర్శనమిచ్చారు. బంగారుపాళ్యం మండలం మొగిలిలో ఉదయం మూలవర్లకు ఆలయ ప్రధాన అర్చకులు గంగాధర్ గురుకుల్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం అలంకార మండపంలో ఉత్సవమూర్తులను మురళీగురుకుల్ ఆధ్వర్యంలో అలంకరించి పుష్పపల్లకిపై ఊరేగించారు. బెంగళూరు నుంచి తీసుకొచ్చిన సుగంధభరితమైన పుష్పాలతో రథాన్ని సుందరంగా అలంకరించారు. బొమ్మాయిపల్లె చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, జీఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత మమత ఈశ్వర నాయుడు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబీ విజయ్‌కుమార్, ఈవో మునిరాజ, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కు 24 బృందాల ఎంపిక


బహుమతులు అందిస్తున్న జిల్లా అధికారులు

గంగవరం, మార్చి 13 : రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరచిన 24 మంది జాతీయ ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌కు అర్హత సాధించారని డీఈవో దేవరాజులు తెలిపారు. ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు స్థానిక మదర్‌థెరీసా కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ఎగ్జిబిషన్‌కు వివిధ జిల్లాల నుంచి 311మంది విద్యార్థులు హాజరై వారి నమూనాలను ప్రదర్శించారు. ఎన్‌ఐఎఫ్ (న్యూఢిల్లీ), గుజరాత్ నుంచి వచ్చిన డాక్టర్ మహిమ, అనంతగుప్త, సునీల్ భాస్కర్ జడ్జిలుగా వ్యవహరించి ప్రతిభ కనబరచిన వారిని జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక చేశారు. జాతీయ స్థాయికి ఎంపికైన వారిలో అన్నమయ్య జిల్లాకు చెందిన షేక్ రుక్సాన, వైఎన్ నిహాల్ కృష్ణ, కె.జ్యోతి(అనంతపురం), అనకాపల్లె జిల్లాకు చెందిన వి.గుణశ్రీకీర్తి, చిత్తూరు జిల్లాకు చెందిన ఎస్.రాహుల్, లోక్‌ప్రకాష్ చౌదరి, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కె.సత్యదుర్గ నాగేంద్ర కుమార్, బయశెట్టి లక్ష్మణ్, కృష్ణాజిల్లాకు చెందిన కె.నిహారిక, కాకినాడ జిల్లాకు చెందిన జి. అనుష్క, ఎం.దుర్గ సాయి, కోనసీమ జిల్లా నక్క సత్యప్రవీణ్, పల్నాడు జిల్లాకు చెందిన షేక్ రయాన్, షేక్ జమీర్, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన పి.వంశీ కుమార్, తిరుపతి జిల్లాకు చెందిన వి.నిరూష, గొల్లపల్లి రేష్మ, ఎం. వాణి, విజయనగరం జిల్లాకు చెందిన బి.నిహారిక, జి. పూజిత, కడప జిల్లాకు షేక్ ఆసిఫా, ఎం. రుగ్వేద వర్మ, బి. విజిత్ అభిలాష్, హైతన్ జైన్ తయారుచేసిన ఫార్ములాలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రకటించారు. ఎంపికైన వారందరికీ సూపర్ బజార్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్, పద్మశ్రీ శ్రీనాథ్‌తో కలసి విద్యాశాఖ అధికారులు ప్రశంసా పత్రాలు, మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీవో వెంకటరమణా రెడ్డి, డీవైఈవో చంద్రశేఖర్, డీఎస్‌వో రమణ, ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, సాయిలీల, లీలారాణి, పలు జిల్లాలకు చెందిన టీమ్ లీడర్లు, హెచ్‌ఎంలు, జిల్లా విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై వలంటీరు దాడి


గాయపడిన ఆనంద్ - వలంటీరుపై చర్యలు తీసుకోవాలని కమిషనరుకు వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

పలమనేరు, మార్చి 13: పలమనేరు మున్సిపాలిటీ లోని టీఎస్ అగ్రహారం సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ ఆనంద్‌పై వలంటీరు సురేష్ కుమార్, మరికొందరు దాడిచేసిన ఘటనపై బుధవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి హాజరు కావాలని వలంటీరు సురేష్‌కుమార్‌కు ఆనంద్ సూచించారు. దీనిపై ఈనెల 10వతేది ఆనంద్ ఇంటివద్దకు సురేష్, మరో నలుగురు వెళ్లి కర్రలతో, ముష్టిఘాతాలతో భౌతిక దాడికి పాల్పడ్డారు. ఎడమ కన్ను, ఛాతీ వద్ద గాయాలయ్యాయి. ఆయన ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందారు. ఈ ఘటనపై అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. దీనిపై బుధవారం పలమనేరు ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘ నాయకులు సీఐ చంద్రశేఖర్‌కు, మున్సిపల్ కమిషనరు రమణారెడ్డికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి వలంటీరుతో పాటు అతడికి సహకరించిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకొంటామని అధికారులు వీరికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘ అధ్యక్షుడు ఆనంద్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.హరి, జిల్లా అధ్యక్షుడు రమణ, ఉద్యోగ సంఘ నాయకులు హైదర్, జలంధర్, మురళి, పుష్ప, గీతాంజలి, కళావతి, బాధిత ఉద్యోగి ఆనంద్ పాల్గొన్నారు.



వరసిద్ధుడి సేవలో విదేశీ భక్తులు

కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని బుధవారం 46 దేశాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు. వీరిలో ప్రధానంగా అమెరికా, కెనడా, యూకే, నెదర్లాండ్స్, జర్మనీ, రష్యా వంటి దేశాలకు చెందిన వారున్నారు.

- ఐరాల(కాణిపాకం)

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.13 కోట్లు



ఐరాల(కాణిపాకం), మార్చి 13: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,13,03,666 లభించినట్లు ఛైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. బుధవారం ఆలయ సిబ్బంది ఆస్థాన మండపంలో స్వామి కానుకలను లెక్కించారు. ఈ ఆదాయంలో బంగారు 100గ్రాములు, వెండి 670గ్రాములు, 70 యూఎస్‌ఏ, 210 కెనడా, 60 న్యూజిల్యాండు డాలర్లు, 20 ఇంగ్లాండు పౌండ్లు లభించాయి. గో సంరక్షణ హుండీ ద్వారా రూ.10,900, ప్రచార రథం హుండీ ద్వారా రూ.5,589 లభించినట్లు వారు తెలిపారు. ఈ ఆదాయం పూర్తిగా ఆలయానికి 19 రోజుల్లో సమకూరినట్లు వారు పేర్కొన్నారు. ఈ లెక్కింపులో ఏఈవోలు రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రూ. 80వేల గంజాయి సీజ్

● పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు


నిందితుడిని మీడియాకు చూపిస్తున్న సీఐ

చిత్తూరు, మార్చి 13: గంజాయి తరలిస్తున్న పాత కేసులో పరారీలో ఉన్న నిందితుడిని రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ.80వేల విలువ చేసే గంజాయిని, ప్యాసింజర్ ఆటోను సీజ్ చేశారు. రెండో పట్టణ సీఐ ఉలసయ్య తెలిపిన ప్రకారం.. బుధవారం కాణిపాకం జంక్షన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్యాసింజర్ ఆటోలో వస్తున్న సంతపేటకు చెందిన రవి కుమార్ అలియాస్ ఆటో రవిని అనుమానం వచ్చి తనిఖీ చేశారు. ఆ ఆటోలో ఉన్న రూ.80వేల విలువ చేసే రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆటో రవిని అదుపులోకి తీసుకుని విచారించగా గతంలో ఓ కేసులో నిందితుడిగా ఉండి.. పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నట్లు తెలిసింది. అతడిని రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషిచేసిన బాబు, హరిప్రసాద్, ధనరాజ్, మధు, గోవిందరావును సీఐ అభినందించారు.

జూన్ నెల రూ.300 ప్రత్యేక దర్శన టికెట్ల కోటా 25న విడుదల

18, 21 తేదీల్లో శ్రీవారి ఆర్జిత సేవల కేటాయింపు

తిరుమల, మార్చి13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి సంబంధించి జూన్ నెల రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను టీటీడీ ఈనెల 25వ తేదీన విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లో ఈ కోటాను విడుదల చేయనున్నారు.ఇదే నెలకు సంబంధించి శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల లక్కీడిప్ కోసం భక్తులు ఈనెల 18వ తేదీ ఉదయం 10 నుంచి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోపు సేవలకు ఎంపికైన భక్తులు సొమ్ము చెల్లించి టికెట్లు ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. 21వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీవారి ఆర్జితసేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్ల కోటాను విడుదల చేస్తారు. జూన్ 19 నుంచి 21వ తేదీ వరకు జరుగనున్న జ్యేష్ఠాభిషేక ఉత్సవాల్లో పాల్గొనేందుకు మార్చి 21న ఉదయం 10 గంటలకు టికెట్లు భక్తులకు అందుబాటులో ఉంచుతారు.అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి వర్చువల్ సేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లు, దర్శన టికెట్ల కోటాను విడుదల చేస్తారు. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణిట్రస్టు దాతల దర్శనం, గదుల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల దర్శన టికెట్ల కోటాను విడదల చేస్తారు. మార్చి25న మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిల్లోని గదుల కోటాను విడుదల చేస్తారు. 27న ఉదయం 11 గంటలకు తిరుమల, తిరుపతిల్లోని శ్రీవారి సేవా కోటాను, అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు నవనీత సేవ కోటాను,ఒంటి గంటకు పరకామణి సేవ కోటాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు.

అలిపిరి టోల్‌గేట్ సిబ్బందికి మెమోలు

● చెక్ పాయింట్‌లో తనిఖీల తీరు మారాలంటూ ఆదేశం
● టోల్‌గేటుకు అదనంగా 20మంది గార్డుల కేటాయింపు


అలిపిరి టోల్‌గేట్‌లో బుధవారం నాటి తనిఖీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సిద్ధం సభ నుంచీ నిషేధిత వస్తువులతో ఆర్టీసీ బస్సులు తిరుమల కొండపైకి చేరుకున్న ఘటనలో నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించిన అలిపిరి టోల్‌గేట్ సిబ్బందికి టీటీడీ సీవీఎస్వో మెమోలు జారీ చేశారు. మద్యం గ్లాసులు, ఎముకలతో ఆర్టీసీ బస్సులు చెక్ పాయింట్ ఎలా దాటాయి? అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన వార్త టీటీడీ వర్గాల్లో కలకలం రేపింది. టీటీడీ సీవీఎస్వో ఈ వ్యవహారంలో బాధ్యులైన వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. వైసీపీ సభ నుంచీ నిషేధిత వస్తువులతో బస్సులు అలిపిరి చెక్‌పాయింట్ దాటిన సమయంలో విధుల్లో వున్న ఏడుగురు విజిలెన్స్ సిబ్బందిని, ఐదుగురు ఎస్పీఎఫ్ సిబ్బందిని తన కార్యాలయానికి పిలిపించి మందలించారని సమాచారం. వీరితో పాటు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్‌ను కూడా పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇక మీదట భద్రతా లోపాలు బయటపడితే చెక్‌పాయింట్ ఇన్‌చార్జిపై తీవ్ర చర్యలుంటాయని హెచ్చరించినట్టు తెలిసింది. కాగా బుధవారం నుంచీ అలిపిరి చెక్‌పాయింట్‌లో తనిఖీలు ముమ్మరమయ్యాయి. తిరుమల నుంచీ అదనంగా 20 మంది గార్డులను అలిపిరి చెక్‌పాయింట్‌కే కేటాయించారు. ప్రతి యాత్రికుని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆ క్రమంలో వాహనాలు టోల్‌గేట్ దాటడానికి ఆలస్యమైనా పరవాలేదని స్పష్టం చేసినట్టు సమాచారం. కాగా బుధవారం టోల్‌గేట్ వద్ద తనిఖీల తీవ్రత పెరిగింది. వాహనాల కదలికలు కూడా మందగించాయి. ఉన్నతాధికారుల ఆగ్రహంతో అప్రమత్తమైన చెక్ పాయింట్ సిబ్బంది కట్టుదిట్టంగా తనిఖీలు జరిపారు. తనిఖీల సందర్భంగా సెక్యూరిటీ గార్డులు కఠినంగా వ్యవహరించడంతో యాత్రికుల నుంచీ స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ బాటిళ్ళు భారీ సంఖ్యలో పోగుపడ్డాయి.

పలమనేరులో రూ.2 కోట్లకు ఐపీ

పలమనేరు, మార్చి 13 : పలమనేరుకు చెందిన వి.ఉదయ్‌కుమార్ రూ.1,98,65,500లకు ఐపీ దాఖలు చేసుకున్నారు. పలమనేరు మార్కెట్ కమిటీ సమీపంలో వ్యాపారం చేసుకునే ఉదయ్‌కుమార్ కనిష్ఠంగా రూ. రూ.45 వేలనుంచి అత్యధికంగా 19 లక్షల మేర 33 మంది వద్ద అప్పులు చేశాడు. అప్పులకు అధిక వడ్డీ కట్టలేక స్థానిక అడ్వొకేట్ అశోక్‌కుమార్ ద్వారా బుధవారం పలమనేరు కోర్టులో ఐపీ దాఖలు చేసుకున్నాడు. వారం క్రితమే ఉదయ్ కుమార్ పట్టణంలో కనిపించక పోవడంతో అతనికి అప్పులు ఇచ్చిన బాధితులు పలమనేరు పోలీసులకు కూడా ఫిర్యాదులు చేశారు. కాగా తీసుకొన్న అప్పులకు ఉదయ్ కనీసం చెక్కులు, బాండ్లు కూడా రాసివ్వలేదని తెలుస్తోంది.

చిత్తూరు ఎమ్మెల్యేకి తిరుపతి సీటు!

అభ్యర్థి ఎంపికకు జనసేన తీవ్ర కసరత్తు... పలువురి పేర్ల పరిశీలన

సర్వేలో వ్యతిరేకత వచ్చినా ఆరణి వైపే జనసేనాని మొగ్గు




తిరుపతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జనసేన సీటు చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ఖరారైంది. టీడీపీ-బీజేపీలతో పొత్తు కూటమిలో వున్న జనసేనకు తిరుపతి సీటు కేటాయించిన సంగతి తెలిసిందే.టీడీపీ పరంగా తిరుపతి అసెంబ్లీ సీటు తొలినుంచీ కీలకమే. ప్రతిసారీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఎంపికపై స్థానికంగానే కాకుండా జిల్లావ్యాప్తంగా కూడా జనం ఆసక్తి చూపుతుంటారు. అయితే ఈ పర్యాయం జనసేనతో పొత్తు కారణంగా అభ్యర్థి ఎంపిక మరింత ఆసక్తికరంగా మారింది. ఆరు నెలల కిందటే జనసేనతో పొత్తు వుంటుందని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో పొత్తులో భాగంగా తిరుపతి సీటు జనసేనకే కేటాయిస్తారన్న అంచనా జనంలో మొదలైంది. ఓ దశలో తిరుపతిలో అధికార పార్టీ అభ్యర్థిని ఢీకొనగలిగే వనరులు జనసేన నాయకులకు లేవన్న అభిప్రాయం కలగడంతో సీటు టీడీపీకే దక్కుతుందనే ప్రచారం జరిగింది. ఈలోపు సీట్ల సర్దుబాటు జరగడంతో తిరుపతి సీటు జనసేనకు కేటాయించారు. ఆ వెంటనే బీజేపీ కూడా కూటమిలో చేరడంతో తిరుపతి సీటును బీజేపీ కోరుతుందన్న ప్రచారం ప్రారంభమైంది. ఆలోగా చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆ పార్టీని వీడి జనసేనలో చేరిపోయారు. సీటు ఏ పార్టీకన్న ప్రచారాలు ఓవైపు సాగుతుండగానే మరోవైపు పరిణామాలు వేగంగా మారిపోయాయి.తిరుపతి సీటు జనసేనకు కేటాయించడంతో టీడీపీ నేతలు సుగుణమ్మ, ఊకా విజయ్ కుమార్ జనసేనలో చేరి టికెట్ తెచ్చుకునేందుకు సిద్ధపడ్డారు. వీరి ప్రయత్నాలు కొనసాగుతుండగానే రాజంపేట టీడీపీ నేత గంటా నరహరి బుధవారం జనసేనలో చేరారు. తిరుపతి టికెట్ కోసం ఒత్తిడి పెరగడంతో తొలుత చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించారు. సర్వేలో ఆయన పట్ల అత్యధికులు వ్యతిరేకత కనబరిచినట్టు తేలడంతో ఆయన పేరు పక్కన పెట్టి గంటా నరహరి వైపు మొగ్గు చూపుతున్నారని జనసేన, టీడీపీ వర్గాల్లో ప్రచారం జరిగింది. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ గంటల వ్యవధిలో ఆరణి శ్రీనివాసులును అభ్యర్థిగా పవన్ కళ్యాణ్ ఖరారు చేశారు. దీనిపై ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటిస్తారని సమాచారం. కాగా ఈ పరిణామాలు తిరుపతి నియోజకవర్గ జనసేన, టీడీపీ వర్గాలలో కలకలం రేపాయి. స్థానికులైన బలిజలకే టికెట్ కేటాయించాలన్న డిమాండ్ గట్టిగా వినిపిస్తున్న నేపథ్యంలో చిత్తూరు ఎమ్మెల్యేకి టికెట్ ఖరారు చేయడం వివాదం రేగేందుకు అవకాశమిస్తోంది. ఆరణి శ్రీనివాసులు అభ్యర్థిత్వం పట్ల టీడీపీ, జనసేన పార్టీల శ్రేణుల స్పందన ఎలా వుంటుందో, రానున్న రోజుల్లో నియోజకవర్గంలో ఈ రెండు పార్టీల్లో ఎలాంటి సమీకరణలకు దారితీస్తుందో వేచి చూడాల్సి వుంది.

శ్రీవారికి థ్యాంక్స్

- గామి సక్సెస్‌పై హీరో విశ్వక్ సేన్

తిరుమల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : తన 'గామి' చిత్రం విజయవంతమైన నేపథ్యంలో శ్రీవేంకటేశ్వరస్వామికి థ్యాంక్స్ చెప్పడానికి తిరుమలకు వచ్చినట్టు హీరో విశ్వక్ సేన్ తెలిపారు. చిత్ర దర్శకుడు విద్యాధర్ కాగిత, హీరోయిన్ చాందినితో కలిసి ఆయన బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.అనంతరం విశ్వక్‌సేన్ మీడియాతో మాట్లాడుతూ.. తన ప్రతి సినిమా విడుదలకు ముందు, తర్వాత స్వామి దర్శనానికి రావడం ఆనవాయితీ అన్నారు.'గామి' మంచి విజయాన్ని సాధించిన క్రమంలో స్వామికి ధన్యవాదాలు తెలిపేందుకు వచ్చానన్నారు. హీరోయిన్ చాందిని మాట్లాడుతూ.. గామి చిత్రాన్ని విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలన్నారు. దర్శకుడు విద్యాధర్ మాట్లాడుతూ.. గామి విజయం ప్రేక్షకులు ఇచ్చిందన్నారు. విశ్వక్‌సేన్‌తో సెల్ఫీలు తీసుకునేందుకు పలువురు పోటీ పడ్డారు. వారిలో కొంతమంది మొబైళ్లను విశ్వక్‌సేన్ సరదాగా లాక్కుని కాసేపు ఆటపట్టించాక తిరిగిచ్చేశారు. సాయంత్రం తిరుపతిలో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో విశ్వక్‌సేన్ మాట్లాడుతూ నాలుగురోజులైనా కలెక్షన్స్ తగ్గలేదంటూ ఆనందం వ్యక్తం చేశారు.


విశ్వక్‌సేన్, చాందిని



ధ్వజావరోహణం - సింహాసనం, కామధేనువులపై శివపార్వతుల పురవిహారం

సింహాసనంపై శివయ్య వైభవం

● ముక్కంటి శివరాత్రి ఉత్సవాలకు శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం


ధ్వజావరోహణం సందర్భంగా పూజలు

శ్రీకాళహస్తి, మార్చి 13: శ్రీకాళహస్తీశ్వరాలయ శివరాత్రి ఉత్సవాల్లో బుధవారం రాత్రి దేవరాత్రిని పురస్కరించుకొని శివపార్వతులు కైలాస మేరుపర్వత సింహాసనం, కామధేనువుపై పురవిహారం చేశారు.అంతకు ముందు ఉత్సవాలకు ధ్వజావరోహణ కార్యక్రమం ఆలయంలో శాస్త్రోక్తంగా జరిగింది. అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ధ్వజ స్తంభం వద్ద కొలువుదీర్చారు. ఆ తరువాత యాగశాలలో పది రోజుల నుంచి పూజలందుకున్న స్వామి, అమ్మవార్ల ఆవాహన కలశాలకు పూజలు చేశారు. వేదోక్తంగా కలశ ఉద్వాసన పలికారు. అనంతరం యాగశాల నుంచి పవిత్ర కలశాలను అర్చకులు శిరస్సుపై దాల్చి ఆలయంలో ప్రదక్షిణ చేసిన తరువాత స్వామివారి ధ్వజస్తంభం వద్దకు తీసుకువచ్చారు. ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేసి వృషభ సంకేత ధవళ పతాకం, కొడి వస్త్రాలు అవనతం చేశారు.అనంతరం ధవళ పతాకాన్ని, దారాన్ని చతుర్మాడ వీధుల్లో కొలువైన నవసంధి వినాయకులకు దర్శింపచేశారు. ఉదయం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను కేడిగ వాహనంపై ఊరేగించాక వసంత మండపంలో త్రిశూలానికి, స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అభిషేకాలు నిర్వహించారు.ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.ఉత్సవాల్లో గురువారం విశిష్టమైన పల్లకీసేవను నిర్వహించనున్నారు.

నేడు చింతపర్తిలో నల్లారి పర్యటన

వాల్మీకిపురం, మార్చి 13: వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి గ్రామ పంచాయతీలో గురువారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పర్యటించనున్నట్లు గ్రామ సర్పంచ్ మహిత శేషాద్రిరెడ్డి తెలిపారు. గురువారం ఉదయం స్థానిక గుంటి గంగమ్మ దేవాలయంలో పూజల అనంతరం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తారని, మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. చింతపర్తి గ్రామంలో టీడీపీ కార్యాలయం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

అశ్వ వాహనంపై సిద్దేశ్వరుడు


అశ్వవాహనంపై ఊరేగుతున్న సిద్దేశ్వర స్వామి

కలకడ, మార్చి 13: కామాక్షి సమేత సిద్దేశ్వరాలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామి, అమ్మవార్లను మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఊరేగించారు. ఆలయం నుంచి ఎర్రయ్యగారిపల్లె మీదుగా కలకడ వీధులలో ఊరేగింపు కొనసాగింది. అర్చకుడు మహేష్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వద్ద పాల ఏకరి సంఘంవారు భక్తులకు అన్నదానం చేశారు. బుధవారం సాయంత్రం అర్చకులు విజయసారథి, సుబ్రమణ్యం ఊంజల్‌సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కె.అఖిలేష్ , రెడ్డెప్ప నాయుడు, సర్పంచ్ విశ్వనాథ్, కృష్ణమనాయుడు, నాగరాజ, విజయ్, మునిరాజ, సుదర్శన్, కుమార్‌నాయుడు, శ్రీనివాసులనాయుడు, శేఖర్‌నాయుడు, మద్దిపట్ల వెంకటరమణనాయుడు, తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బాటగంగమ్మ ఆలయంలో అన్నదానం


అన్నదానంచేస్తున్న ఆలయ నిర్వాహకులు

మదనపల్లె అర్బన్, మార్చి 13: బాటగంగమ్మ జాతర సందర్భంగా బుధవారం ఆలయ ధర్మకర్త అలివేలమ్మ ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారిని పుష్పపల్లకిలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులతోపాటు మున్సిపల్ కౌన్సిలర్ పాకాల హరి, వాల్మీకి సంఘం నాయకులు పొదల నరసింహులు, మేకల విజయ్‌కుమార్, నాగినేనిగోవిందు, బొగ్గిటి కృష్ణమూర్తి, సుదర్శనబాబు, తదితరులు పాల్గొన్నారు.

పాలికి ఇచ్చిన ఆవులు అప్పగించలేదని ఫిర్యాదు

రామసముద్రం, మార్చి 13: పాలికి ఇచ్చిన ఆవులను తమకు అప్పగించడం లేదని గజ్జలవారిపల్లెకు చెందిన కళావతమ్మ మదనపల్లె డీఎస్పీకి బుధవారం ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం మేరకు డ్వాక్రా సంఘం ద్వారా పొందిన రుణంతో కొనుగోలు చేసిన నాలుగు పాడి ఆవుల పోషణ భారం కావడంతో 2018లో కాప్పల్లెకు చెందిన రాజప్ప అనే వ్యక్తికి పాలికి ఇచ్చింది. కొంత కాలం తర్వాత తమ ఆవులను తిరిగి ఇమ్మని కోరగా అతను ఆవులను అప్పగించకపోవడంతో రామసముద్రం ఎస్ఐ, మదనపల్లె సీఐలకు ఫిర్యాదు చేసింది. ఇంతవరకు వారు న్యాయం చేయకపోవడంతో డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు కళావతమ్మ తెలిపారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ములకలచెరువు, మార్చి 13: ములకలచెరువు కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శిల్ప తెలిపారు. ఆరవ తరగతి, మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీనితో పాటు 7,8,9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

జేఎన్టీయూ అధ్యాపకురాలికి డాక్టరేట్


రజిని

కలికిరి, మార్చి 13: కలికిరి జేఎన్టీయూలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న బి. రజినికి జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. జి యో పాలిమర్ కాంక్రీట్ అనే అం శంపై అనంతపురం జేఎన్టీయూ ప్రొఫెసర్ సి.శశిధర్, ప్రొఫెసర్ ఏవీ నరసింహారావు ఆధ్వర్యంలో రజిని సమర్పించిన పరిశోధనా పత్రం మూల్యాంకనంలో అర్హత సాధించినట్లు జేఎన్టీయూ వర్సిటీ మూల్యాంకన డైరెక్టర్ ఇ.కేశవ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా కళాశాల వర్గాలు, కుటుంబీకులు అభినందనలు తెలిపారు.

రేపు బి కొత్తకోట మండల సర్వసభ్య సమావేశం

బి కొత్తకోట, మార్చి13: బి కొత్తకోట మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 15న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నూర్జహాన్ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఎంపీపీ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి తంబళ్లపల్లె శాసనసభ్యులు ద్వారకనాథరెడ్డి హాజరవుతారన్నారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వశాఖల అధికారులు అయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.

ప్రైవేటు స్కూల్స్‌లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి...

బి కొత్తకోట,మార్చి13: బి కొత్తకోట మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటవ తరగతిలో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో రెడ్డిశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆర్‌టీఈ యాక్ట్ ప్రకారం ఎటువంటి ఫీజులు లేకుండా ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. 02-06-2018 నుంచి 31-05-2019 మధ్య జన్మించిన చిన్నారులు దరఖాస్తు చేసుకోవచ్చునని, ఈ నెల 25 లోగా ఆన్‌లైన్‌లో కానీ, స్థానిక సచివాలయం, లేదా ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో కోరారు.

లూటీ సొమ్ముకు ఆశ పడకండి

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి


టీడీపీలో చేరిన వైసీపీనేతలతో నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

గుర్రంకొండ, మార్చి 13:వైసీపీ నాయకుల లూటీ సొమ్ముకు ఆశపడి అక్రమార్కులకు ఓట్లు వేయకండని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సూచించారు. మండలంలోని నడిమికండ్రిగలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు ప్రభుత్వ ఆస్తులను లూటీ చేసి వందల కోట్లు సంపాదించారని ఆరోపించారు. ఈ క్రమంలో ల్యాండ్, శ్యాండ్, వైన్, మైన్‌తో పాటు రేషన్ బియ్యం, ఎర్రచందనం అక్రమ రవాణా, పీలేరు నియోజకవర్గంలోని గుర్రంకొండ, వాల్మీకిపురం, పీలేరు, కలకడలో గుట్టలు, కొండలు, ప్రభుత్వ భూములను కబ్జా చేసి కోట్లు దండుకున్నారన్నారు. ఈ సొమ్ముతో ఓట్లను కొనుగోలు చేయడానికి వైసీపీ నాయకులు అప్పుడే ప్రజలకు పంపకాలు ప్రారంభించారని తెలిపారు. వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. పీలేరు నియోజకవర్గంలో వైసీపీ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. గుర్రంకొండ మండలంలో ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు కబ్జా చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. వైసీపీ నాయకుల అరాచకాలు మితిమీరిపోయాయని త్వరలోనే వారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. తమ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు బనాయించిన వారిని ఉపేక్షించమన్నారు. టీడీపీ ప్రవేశ పెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని కోరారు. ప్రతి ఇంటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం చేసిన మోసాలను వివరిస్తూ టీడీపీకి బలం చేకూర్చాలన్నారు. టీడీపీ గెలుపునకు ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు.

వైసీపీ నేతల చేరిక

నడిమికండ్రిగకు చెందిన వైసీపీ సీనియర్ నాయకులు పి.శ్రీనివాసులు, ఏ.సురేష్‌బాబు, ఎస్.బాలకృష్ణ, ఎం.ఈశ్వర్, డి.శేఖర్, జీ.సురేష్, బి.రమణ, పెద్దిగాని నరసింహులు, శ్రీరాములు, కే.వెంకటరమణ, కే.రెడ్డిశేఖర్, సి.శంకర, సి.సత్యనారాయణ, జే.నరసింహులు, చిన్నప్ప, రమేష్, శ్రీనివాసులు, రాజగోపాల్, చల్లా రామూర్తి, కే.మోహన్‌రెడ్డి, రెడ్డెప్ప, అశోక్, ఆదినారాయణ, శోభనబాబు, కిరణ్, నారే సుధాకర్, శ్రీరాములు, రెడ్డిసురేష్, చిన్నవెంకటరమణలతోపాటు 30 కుటుంబాల సభ్యులు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో టీడీపీ కండువాను కప్పుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీకి మంచి మెజారిటీ వచ్చేలా పని చేయాలన్నారు. అంతకమునుపు తరిగొండలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, రెడ్డిప్రసాద్‌నాయుడు, నౌషాద్‌అహ్మద్, మూర్తిరావు, హరిప్రసాద్‌నాయుడు, ఏజాజ్ అహ్మద్, మురళీ, సుధాకర్, శ్రీనివాసులు, క్రాంతి, మేకల చలపతి, రెడ్డిశేఖర్, చంద్రబాబు, మహాత్మారెడ్డి, జయసూరి, ఆనంద్, ప్రకాశ్, సుబ్బరాజు, పెద్దిగాని రెడ్డిశేఖర్, రామాంజులు, రాము, బయ్యారెడ్డి, చిన్నప్ప, దేవకి, రామయ్య, తన్వీర్, బాబాజాన్, సతీష్, వెంకటరమణ, సుబ్బయ్య, నరసింహులు, ద్వారక, సాగర్, రంజిత్ పాల్గొన్నారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లెలో బుధవారం సాయంత్రం బాబు ష్యూరిటీ-భవిష్యత్‌గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జగదీష్, రామాంజులు, దొరస్వామినాయుడు, రెడ్డెప్ప, చలపతి, బుజ్జి, కుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో విజయకేతనం ఎగురవేద్దాం..

● కార్యకర్తలకు టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి పిలుపు


ప్రచారం చేస్తున్న జయచంద్రారెడ్డి

కురబలకోట, మార్చి 13: తంబళ్లపలె నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేద్దామని టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కురబలకోట, అంగళ్లు, ముదివేడు, సర్కారుతోపు, చేనేతనగర్ తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి టీడీపీకి చెందిన పలువురు నాయకులు క్లస్టర్ ఇన్‌చార్జి వైజి. రమణ, చాంద్‌బాషా, అయూబ్‌బాషా, సదాకత్, రాజారెడ్డి, మాజీ సర్పంచ్ రాఘవరావు, మాజీ ఎంపీపీ కుళ్లాయప్ప, నార్లపల్లె చంద్రారెడ్డి తదితరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాకు ఒక అవకాశం ఇచ్చారని, మీరందరూ కలిసికట్టుగా పని చేసి గెలిపించాలని కోరారు. వెనుకబడిన తంబళ్ళపల్లెను పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్ది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. తంబళ్ళపల్లె పారిశ్రామికంగా తీర్చిదిద్దడంతో ప్రభు త్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే తంబళ్లపల్లెను పారిశ్రామికంగా తీర్చిదిద్ది వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తానన్నారు. వైసీపీ హయాంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, అన్ని రంగాలలో వెనుకబడ్డామన్నారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, ఆయన నాయకత్వానికి ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేసి టీడీపీ గెలుపునకు పాటుపడాలన్నారు. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని ఆదరించి గెలిపించి అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్య క్షుడు సురేంద్రయాదవ్, మండల కన్వీనర్ వై.జి.సురేంద్ర, పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్‌బాషా, జంగా రాఘవరెడ్డి, చాంద్‌బాషా, హబీబుల్లా, ఇస్మాయిల్, డీఆర్ వెంకటరమణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఎన్‌వీ రెడ్డి, మోహన్‌రెడ్డి, రాజారెడ్డి, నజీబ్, శంకర్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అండ టీడీపీ మాత్రమే..


అమరనాథ రెడ్డి కాలనీలో ప్రచారం చేస్తున్న తనూజా రెడ్డి

కలికిరి, మార్చి 13: పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు అన్ని విధాలా అండగా నిలబడేది టీడీపీ మాత్రమేనని నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి సతీమణి తనూజా రెడ్డి తెలిపారు. కలికిరి పట్టణంలో సూపర్ సిక్స్ పథకాలపై బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ స్థానిక సంస్థల పదవుల్లో బీసీ రిజర్వేషన్లకు వైసీపీ కోత పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తన భర్త అహర్నిశలూ కృషి చేసిన విషయం గుర్తించాలని కోరారు. ఈ పదేళ్లలో నియోజకవర్గం 20 ఏళ్ళు వెనక్కి వెళ్లిన విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రం పురోభివృద్ధి సాధించాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. పట్టణంలోని టీబీ రోడ్డు, అమరనాథ రెడ్డి కాలనీ, రామ్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు గాయత్రి, కలికిరి సర్పంచు ప్రతాప్‌కుమార్ రెడ్డి, నిజాముద్దీన్, సనావుల్లా, షాహూర్, అఫ్రోజ్, ఏఎంసీ బుజ్జి, నాగభూషణ రెడ్డి, రాజా రెడ్డి, సహదేవ రెడ్డి, వర్మ, అగస్త్రీ, జనసేన అస్లాం, రమేష్ చెట్టి, గడ్డం ఏసురాజు, కేవీ రెడ్డి, విజయకుమార్ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, మధుసూదన రెడ్డి, అన్వర్ బాషా, వైజాగ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తోనే రాష్ట్రాభివృద్ధి


తాండాలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి సతీమణి కల్పన

పెద్దమండ్యం, మార్చి 13: టీడీపీ తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్య మని తంబళ్లపల్లి నియోజకవర్గం టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి సతీమణి కల్పన తెలిపారు. పెద్దమండ్యం మండలంలో బుధవారం ఆమె ప ర్యటించారు. మండలంలోని మందలవారిపల్లి, దిగువపల్లి, అవికేనాయక్ తాండా, వడ్డివంక తాండా, చిగురుమాను తాండా, తుమ్మలవంక తాండా, దేవలం తాండ, ఎర్రగుట్టపల్లి తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆరు హామీలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ, జనసేన నా యకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి తంబళ్లపల్లిలో టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డిని గెలిపించి టీడీపీ జండా ఎగరవేయాలని కోరారు. రాష్ట్రంలో టీడీపీ విజయంతో చంద్రబాబును సీఎం చేయాలని పిలుపు నిచ్చారు. టీడీపీ గెలుపు కోసం సమష్టిగా సైనికుల్లాగా పని చేయాలన్నారు. నాయకులు వేణుగోపాల్ రెడ్డి, మల్లయ్య, రామదాస్, శంకరరెడ్డి సాంబశివనాయక్ టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మొల్ల జీవితం.. మహిళలకు ఆదర్శం


రాయచోటి: కవయిత్రి మొల్ల చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఆర్‌వో


సిద్దవటం: మొల్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమాండెంటు రవిశంకర్



నందలూరు: పుస్తకం ఆవిష్కరిస్తున్న లయన్ బచ్చు భాస్కరరావు తదితరులు

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 13: మొల్ల జీవితం.. మహిళా లోకానికి ఆదర్శమని, సకల గుణాభిరాముడు శ్రీరాముని చరితమున సరళంగా రాసిన ఘనత కవయిత్రి మొల్లది అని జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ అన్నారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి సందప్ప ఆధ్వర్యంలో మొల్లమాబ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో సత్యనారాయణ మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కడప జిల్లా గోపవరంలో కుమ్మరి కుటుంబంలో జన్మించిన ఆతుకూరి మొల్ల 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి అన్నారు. ఆమె రచనా శైలి సరళమైనది, రమణీయమైందన్నారు. తాళ్లపాక అన్నమయ్య (అన్నమాచార్య) భార్య తాళ్లపాక తిమ్మక్క తర్వాత చెప్పుకోదగ్గ తెలుగు కవయిత్రి మొల్ల అని కీర్తించారు. సకల గుణాభిరాముడు శ్రీరాముని చరితమును ఎందరో ఎన్నో విధాలుగా విధాలుగా రచించినా సామాన్యులకు సైతం అర్థమయ్యే తెలుగు భాషలో రామాయణాన్ని రాయడం ఆమె ప్రత్యేకత అన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సందప్ప మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల సమయంలో ఈమె ఆరు కాండాల్లో 871 పద్యాలతో రచించిన రామాయణం మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిందన్నారు. ఈ కావ్యాన్ని మొల్ల కేవలం ఐదు రోజుల్లో రాసిందని చెబుతారన్నారు. మొల్ల రచన ఆనాటి పద్ధతికి విరుద్ధంగా వాడుక భాషకు దగ్గరగా ఉందని, తెలుగు రామాయణాల్లో మొల్ల రామాయణం చాలా సరళమైందన్నారు. ఆమె జ్ఞాపకార్థం 2017లో భారత ప్రభుత్వం తపాలా బిళ్ల విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల శాఖ సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చిట్వేలి: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో తెలుగు కవయిత్రి మొల్ల జయంతి వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో రాజేశ్వరి మాట్లాడుతూ ఇంట్లో నుంచి స్త్రీలు బయటకు వెళ్లలేని పరిస్థితుల్లో ఒక మహిళ రామాయణాన్ని రచించడం ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-1 సూపర్‌వైజర్ వసుంధరమ్మ, గ్రేడ్-2 సూపర్‌వైజర్ సురేఖరాణి, జీఎంఎస్ కె.స్వర్ణలత, అటెండర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నందలూరు: కలలకు కాణాచి అయిన కడప జిల్లాలో కవయిత్రి మొల్లమాంబ జన్మించడం జిల్లాకే గర్వకారణమని, ఆమె మహిళలందరికీ ఆదర్శమని సీనియర్ మెడికల్ ఆఫీసర్ లయన్ బచ్చు జయభాస్కరరావు తెలిపారు. నందలూరు లయన్స్‌క్లబ్, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొల్ల రామాయణం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ లయన్ మన్నెం రామ్మోహన్ మాట్లాడారు. అనంతరం మొల్ల చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లయన్ కుర్రా మణియాదవ్, కొత్తపల్లి రాజాచారి, వాకర్ క్లబ్ ప్రెసిడెంట్ మోడపోతుల రాము, వాకర్స్ క్లబ్ ట్రెజరర్ గాడి సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసు బెటాలియన్‌లో...

సిద్దవటం: భాకరాపేట పోలీసు బెటాలియన్‌లో కమాండెంటు పి.రవిశంకర్ మాట్లాడుతూ రామాయణాన్ని అతి సులువైన పదాలతో తెలుగులో రాసిన తొలి కవయిత్రిగా పేరు ప్రఖ్యాతలు గాంచారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంటు డి.నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాం డెంటు జయప్రసాద్, ఆర్ఎస్ఐలు, ఏఆర్ ఎస్ఐలు పాల్గొన్నారు.

హంస వాహనంపై వీరభద్రుడి విహారం


హంసవాహనంపై భద్రకాళీ సమేత వీరభద్రుడు

రాయచోటిటౌన్, మార్చి 13: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో బుధవారం ఉదయం మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణం, కంకణ విసర్జన, వసంతోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ధ్వజావరోహణ, కంకణ విసర్జన, వసంతోత్సవాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి హంస వాహనంపై ఆసీనులను చేసి పట్టణ వీధుల్లో ఊరేగించారు. నీలకంఠ్రావుపేటకు చెందిన బృందం చెక్కభజన కార్యక్రమం, భజన గురువు తుమ్మల హరినాథ ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శించారు. వాహనాల ఊరేగింపు సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

టీడీపీ, జనసేనతోనే సంక్షేమం


ప్రచారం చేస్తున్న టీడీపీ జనసేన నాయకులు

వాల్మీకిపురం, మార్చి 13: రాష్ట్రంలో నిరుపేదల సంక్షేమం టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వంతోనే సాధ్యమని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడుమల్లికార్జునరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెలగపల్లె, బురుజుగడ్డ, చిన్ననారాయణ పల్లెలలో ఇరు పార్టీల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా సూపర్ సిక్స్ కరపత్రాలు పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ అయిదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. నవరత్నాలు అంటూ ప్రజల చెవిలో పూలు పెట్టిందని ఆరోపించారు. నిరుపేదలకు ఇచ్చే రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కల్తీలకు పాల్పడుతూ వేలకోట్లు దండుకున్న సీఎం జగన్ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో పీలేరు నియోజకవర్గంలో నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి గెలుపు తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనాథరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఆదిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, చంద్రమౌళి, వల్లిగట్ల వెంకటరమణ, రాజగోపాల్,మరళి, నాగరాజు, ఎండీ యూసుఫ్, అనిల్, మధు, యల్లప్ప టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే సంక్షేమ పథకాలు


టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న మైనారిటీ నాయకులు

కలకడ, మార్చి 13: రాష్ట్రంలో టీడీపీ పాలనలో ప్రజల కోసం వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని ఆ పార్టీ మైనారిటీ నాయకులు తెలిపారు. కలకడ పంచాయతీ కొత్తపల్లెలో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింట కరపత్రాలను పంపిణీ చేసి టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని టీడీపీ బలపరిచి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు జిలానీ, ముబారక్‌అలీ, ఖాజా, ఇర్ఫాన్, ఇమ్రాన్‌లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా పని చేయాలి


మాట్లాడుతున్న షేక్ రెడ్డిసాహెబ్

మదనపల్లె అర్బన్, మార్చి 13: కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే ధ్యేయంగా పని చేయాలని మదనపల్లె నియోజకవర్గ నాయకుడు షేక్ రెడ్డిసాహెబ్ పిలుపునిచ్చారు. బుధవారం నియోజకవర్గంలోని రామసముద్రంలో సంక్షేమ పథకాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వారసురాలు వైఎస్ షర్మిల తన తండ్రి ఆశయాలను నెరవేర్చడానికి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారన్నారు. రాజశేఖర్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి జరిగిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఇదే రీతిలో రాష్ట్రంలో నిరుపేద కుటుంబాల మహిళలకు ప్రతి నెల రూ.5వేలు అందించే ఉన్నత పథకం కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందన్నారు. వ్యవసాయానికి 9 గంటలు కరెంటు, రైతు రుణమాఫీ చేయగలిగే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీని గెలిపించుకుంటే దేశంలో, రాష్ట్రంలో ప్రజా సంక్షేమ ప్రభుత్వం వస్తుందన్నారు. దేశంలో రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు. షర్మిల రావడంతో రాజన్న పాలన అందిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికే గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ పుంజుకుందని తెలిపారు.

మార్కెట్ సెస్సు వేలంతో రూ.1.36లక్షలు ఆదాయం

నిమ్మనపల్లి, మార్చి 13: స్థానిక పంచాయతీ పరిధిలో బస్టాండు గేటు వేలంతో రూ.1.36 లక్షలు ఆదాయం చేకూరినట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ తెలిపారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో బస్టాండు గేటు వేలం నిర్వహించారు. గతవారం ఎవరూ రాక పోవడంతో వేలం వాయిదా పడింది. దీంతో అప్‌సెట్ ప్రైజ్‌కు రూ.1000లు పెంచి మాదిగపల్లికి చెందిన రమణ పాడుకొన్నారు. దీంతో పంచాయతీకి రూ.1.36 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

డీసీసీ ప్రధాన కార్యదర్శిగా రమణమ్మ


నియామకపత్రం అందుకుంటున్న రమణమ్మ

పీలేరు, మార్చి 13: అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా పీలేరుకు చెందిన ఎన్.రమణమ్మ నియమితులయ్యారు. డీసీసీ అధ్యక్షుడు అల్లాబకష్ నుంచి ఆమె బుధవారం నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి అందించిన డీసీసీ అధ్యక్షుడు అల్లాబకష్ కు కృతజ్ఞతలు తెలిపారు.

సేంద్రియ వ్యవసాయానికి సర్టిఫికేషన్


సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కలికిరి, మార్చి 13: సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించే ఉత్పత్తులకు సర్టిఫికేషన్ ప్రక్రియ ఉంటుందని కలికిరి కేవీకే కోఆర్డినేటర్ పాండురంగ తెలిపారు. సేంద్రియ పం టలను నిర్ధారించుకోవడంతో పాటు, వాటి మార్కెటింగ్ నైపుణ్యాలను రైతులు ఆకళింపు చేసుకోవాలని కోరారు. బుధవారం స్థానిక కేవీకేలో ఆర్గానిక్ సర్టిఫికేషన్, మార్కెటింగ్ నైపుణ్యాలు అనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పురుగు మందుల పిచి కారీ కారణంగా వాటి ఉత్పత్తుల్లో అవశేషాలు మానవాళి ఆరోగ్యానికి తీవ్రంగా హాని చేస్తున్నాయన్నారు. ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు, వాటిని మార్కెటింగ్ చేసుకునే విధానాల గురించి జిల్లా పద్మావతి సేంద్రియ వ్యవసాయ మెంటార్ వివరించారు. కేవీకేలోని వర్మీ కంపోస్ట్ యూనిట్, కోళ్ళు, పొట్టేళ్లు, అజొల్లా పెంపకంపై రైతులకు అవ గాహన కల్పించారు

హౌసింగ్ బిల్లుల చెల్లింపునకు కోడ్ అడ్డు కాదు

పీలేరు, మార్చి 13: జగనన్న కాలనీల బిల్లుల చెల్లింపులకు ఎన్నికల కోడ్ అడ్డంకి కాదని జిల్లా హౌసింగ్ ఇన్‌ఛార్జ్ పీడీ శివయ్య పేర్కొన్నారు. పీలేరులోని హౌసింగ్ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహనిర్మాణాలకు చెల్లింపులు చేసేందుకు రూ.1200 కోట్లు సిద్ధంగా ఉన్నాయని, మరో రెండు, మూడు రోజుల్లో మరో రూ.1500 కోట్లు రానున్నాయని తెలిపారు. బిల్లుల విషయంలో ఎవరికైనా అపోహలు ఉంటే 7093931012, 9989953217 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

హెనోసిన్‌లో మిట్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి కల్పన

కురబలకోట, మార్చి 13: మండలంలోని మిట్స్ విద్యార్థులు హెనోసిస్‌లో పోటీలలో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సి. యువరాజ్ తెలిపారు. కళాశాలలో సీఎస్ఈ తృతీయ సంవత్సరానికి చెందిన విద్యార్థులు కోయంబత్తూరులోని డాక్టర్ ఎన్‌జీపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జరిగిన జాతీయస్థాయి సింపోజియంలో పాల్గొన్నారు. పరిశోధన పత్ర పోటీలో శరణ్, తేజ ద్వితీయ బహుమతి, హర్షవర్ధన్, తేజ తృతీయ బహుమతిని సాధించారు. అనిల్‌కుమార్, అనూషా, అరవింద్, భరత్, దశరథరెడ్డి, లక్ష్మీదేవి ప్రతిభ కనబరిచారు. ఆయా విద్యార్థులను కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి కల్పన తదితరులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసికి తీవ్రగాయాలు


గాయపడిన రఫీ

పెద్దతిప్పసముద్రం మార్చి 13 : మండల కేంద్రానికి సమీపంలోని హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.. కర్ణాటక సరిహద్దు గ్రామమైన యనమలపాడికి చెందిన రఫీ (45) ద్విచక్ర వాహనంలో మొలకలచెరువు నుంచి స్వగ్రామానికి వెళుతుండగా పీటీఎం సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద ప్ర భుత్వ మద్యం తరలిస్తున్న వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు సమాచారం అందించడంతో ఏఎస్ఐ గోపాల్ నాయక్ అక్కడికి చేరుకుని 108 వాహనంలో క్షతగాత్రుడిని బికొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వివరించారు.